# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 167 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 06 ఆగస్టు 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 167 06-08-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## తిరుమలలో మళ్ళీ చిరుతపులి సంచారం

**తిరుమల ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



తిరుమలలో మళ్ళీ చిరుతపులి సంచారం కలకలం రేగింది. మంగళవారం స్థానికులు ఉండే ఈస్ట్ బాలాజీ నగర్ బాల గంగమ్మ ఆలయం వద్ద చిరుత సంచారాన్ని అధికారులు గుర్తించారు. సీసీ కెమెరాల్లో చిరుత దృశ్యాలు కనిపించాయి.



## నేడు ఏపీ కేబినెట్



**అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రేపు ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం జరగనుంది. సచివాలయంలో జరిగే ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో మహిళల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై చర్చించబోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి అధికారికంగా ప్రభుత్వం రేపు ప్రకటన చేయనుంది. అలాగే పలు సంస్థలకు భూ కేటాయింపులపై కూడా చర్చించనున్నారు. ఇటీవల సిఎం సింగపూర్లో పర్యటించారు. ఈ పర్యటనపైనా.. కేబినెట్ లో చర్చ జరగనుంది.


## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపుకు పార్లమెంట్ ఆమోదం

**న్యూఢిల్లీ ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించే తీర్మానానికి పార్లమెంట్ మంగళవారం ఆమోదం తెలిపింది. బీహార్‌లో ఎస్ఐఆర్‌పై చర్చ జరపాలంటూ ప్రతిపక్షాల ఆందోళనల మధ్య గతవారం లోక్‌సభ ఈ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కోర్టు తీర్పు కారణంగా మణిపూర్‌లో రెండు జాతుల మధ్య విభేదాలు ఏర్పడ్డాయని చెప్పుకొచ్చారు. మత హింస అని కొందరు పేర్కొంటున్నారని, అది తప్పని అన్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించి ఎనిమిది నెలలు అవుతోందని, ఈ సమయంలో ఒకే ఒక్క హింసాత్మక ఘటన మాత్రమే నమోదైందని అన్నారు. అనంతరం రాజ్యసభ మూజువాణి ఓటుతో తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ఆమోదించడం 'జ్యాంగ బాధ్యత' అని చైర్మన్ హరివంశ్ తెలిపారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు విధించిన ఎనిమిది నెలల గడువు ఆగస్ట్ 13తో ముగియనుంది.

## ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ప్రారంభం

**న్యూఢిల్లీ, ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం మంగళవారం ప్రారంభమయ్యింది. ఎన్డీయే ఎంపీలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించనున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఎన్డీయే నేతలు ప్రధానిని సత్కరించారు. చాలా కాలం తర్వాత ఈ సమావేశంలో అధికార కూటమి ఎంపీలు సమావేశమవుతున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్లు దాఖలు చేయడానికి ఆగస్టు 7న ప్రారంభం కావడానికి కొన్ని రోజుల ముందు ఎన్డీఏ సమావేశం జరగనుంది. నామినేషన్ దాఖలుకు చివరి తేదీ అయిన ఆగస్టు 21 నాటికి కూటమి తన అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీఏకు ఉన్న మెజారిటీ కారణంగా అభ్యర్థి ఎన్నిక ఖాయం అయ్యే అవకాశం ఉంది.

## అత్యంత ధైర్యవంతమైన నిర్ణయం..

### డిప్యూటీ సీఎం పవన్ పోస్ట్ వైరల్!

**ఆర్టికల్ 370 రద్దుకు నేటితో ఆరేళ్లు**

**జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రజలకు పవన్ శుభాకాంక్షలు**

**అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న 'ఆర్టికల్ 370'ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. 2019 ఆగస్టు 5న ఈ అధికరణను నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. రద్దు అనంతరం జమ్మూ కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా (జమ్మూ కశ్మీర్, లడఖ్) విభజించిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 370 రద్దుకు నేటితో ఆరేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు. జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు.

'ఒక చారిత్రాత్మక - తరువాయి 2లో..

### కొందరికి డబ్బున్నా పేదలను ఆదుకునేందుకు

## మనసు రాదు: సీఎం చంద్రబాబు






- ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనకు పీ-4 కార్యక్రమం
- ఈ నెల 19 నుంచి అమలు చేయనున్నట్లు సీఎం వెల్లడి
- పేద కుటుంబాలకు చేయూతనివ్వనున్న 'మార్గదర్శులు'
- తాను 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానన్న చంద్రబాబు
- కార్యక్రమంలో బిల్ గేట్స్, వేదాంత వంటి సంస్థల భాగస్వామ్యం

**అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనకు చేపట్టిన పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్‌షిప్) కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యమని, ఈ కార్యక్రమం ఈ నెల 19 నుంచి అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు,

- తరువాయి 2లో..

## ఏపీ బలంగా పుంజుకుంటోంది...

- ఈ వసూళ్లే నిదర్శనం: మంత్రి నారా లోకేశ్
- జూలైలో రికార్డు స్థాయిలో రూ.3,803 కోట్ల జీఎస్టీ వసూళ్లు
- గత ఏడాదితో పోలిస్తే 14 శాతం వృద్ధి నమోదు అని లోకేశ్ వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే అత్యధిక వృద్ధి రేటు అని వివరణ




**అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దీనికి నిదర్శనంగా జూలై నెలలో జీఎస్టీ వసూళ్లు సరికొత్త రికార్డు సృష్టించాయని రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో 2017లో జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎన్నడూ లేనంతగా 2025 జూలై నెలలో రూ.3,803 కోట్లు వసూలైనట్లు లోకేశ్ పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 14 శాతం అధికమని ఆయన వివరించారు. ఈ వృద్ధి రేటు దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధికమని, దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో మూడో స్థానంలో నిలిచిందని ఆయన

- తరువాయి 2లో..

### అమరావతి నిర్మాణంలో..

## భారీ అవినీతి : జగన్

**అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అమరావతి నిర్మాణంపై అవినీతి ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అమరావతి ప్రాజెక్టులో భారీగా కమిషన్ దందా జరుగుతోందని ఆరోపించారు. ఒక సాధారణ భవనం నిర్మాణానికి హైదరాబాద్ లేదా బెంగళూరు వంటి నగరాలలో చదరపు అడుగుకు రూ.4,000 నుండి రూ.5,000 ఖర్చవుతుందని, కానీ అమరావతిలో అది రూ.10,000లకు చేరుకుందని ఆయన పేర్కొన్నారు. ఈ ధరల పెరుగుదల వెనుక అవినీతి దాగి ఉందని జగన్ ఆరోపించారు.

**ఆర్థిక అక్రమాలపై జగన్ వ్యాఖ్యలు**

జగన్ తన ఆరోపణలను మరింత వివరిస్తూ, అమరావతి నిర్మాణంలో ఆర్థిక అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. 'మొబిలైజేషన్ అడ్వాన్స్' పేరుతో గుత్తేదారులకు 10 శాతం అడ్వాన్స్ ఇచ్చి, అందులో నుంచి 8 శాతం తిరిగి వెనక్కి తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. పవర్ పర్చేస్ అగ్రిమెంట్ల విషయంలో

- తరువాయి 2లో..

### జగన్ హయాంలోనే

## రెడ్‌బుక్ రాజ్యాంగం

### జగన్‌పై నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు

**అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం నిలబెట్టుకోలేదని, జగన్ పాలనలో "రెడ్ బుక్ రాజ్యాంగం" నడిచిందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మీడియాతో మాట్లాడిన నిమ్మల రామానాయుడు, జగన్ ప్రభుత్వం కాలంలో ప్రజలకు మేలు చేసేందుకు ఒక్క అడుగు కూడా వేయలేదని విమర్శించారు. "అక్రమ కేసులు, కక్షసాధింపు చర్యలు, దాడులు – ఇవే ఆ పాలన చిహ్నాలు. ప్రజల సంక్షేమం పూర్తిగా మరచిపోయారు" అని వ్యాఖ్యానించారు.

**సాక్షి దినపత్రికపై ఆగ్రహం**

వైసీపీ నేతలు క్రికెట్ బెట్టింగ్‌లో చిక్కుకున్నా, అక్రమంగా సంపాదించిన ఆస్తులు బయటపడినా.. ఆ విషయాలు సాక్షి పత్రికలో ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నించారు.


- తరువాయి 2లో..

### విశాఖ గ్రోత్ హబ్‌లో భాగంగా.. ఏపీలోని ఆ 3 జిల్లాల్లో

## భూసమీకరణ

**అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు జిల్లాల పరిధిలో భూసమీకరణ చేపట్టనుంది. ఈ మేరకు ఆయా జిల్లాలలో భూసమీకరణ కోసం అధికారులు ప్రకటన కూడా విడుదల చేశారు. విశాఖపట్నం , అనకాపల్లి , విజయనగరం జిల్లాల పరిధిలో మొత్తం 1941.19 ఎకరాలు భూమిని సమీకరించనున్నారు. మొత్తం 13 గ్రామాల పరిధిలోని భూమిని ప్రభుత్వం సమీకరించనుంది. విశాఖ గ్రోత్ హబ్‌లో భాగంగా విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలలో ఈ భూసమీకరణ చేపట్టనున్నారు. విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ) ఈ భూసమీకరణ ప్రక్రియను పర్యవేక్షించనుంది. విశాఖపట్నం జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం మండలాలోని గ్రామాలలో 1,132 ఎకరాలు భూమిని సమీకరించునున్నారు. అలాగే అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం, అనకాపల్లి మండలాలలో 783.69 ఎకరాలు భూమిని సమీకరిస్తారు. విజయనగరం జిల్లాలోని డెంకాడ, భోగాపురం మండలంలోని గ్రామాలలో 25.41 ఎకరాల భూసమీకరణకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.




- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# చిన్నారులకూ స్మార్ట్ కాటు

స్మార్ట్‌ఫోన్లు రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కే కొద్దీ వాటిని వాడే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఒక్క 2025 సంవత్సరంలోనే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 730 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఉన్నట్లు ఓ అంచనా. అందులో 69 కోట్ల మంది మన భారతదేశంలో ఉన్నారు. అంటే దేశ జనాభాలో దాదాపు సగం మంది స్మార్ట్‌ఫోన్లుఉపయోగిస్తున్నారన్న మాట. అయితే వీరిలో చెప్పుకోదగ్గ శాతం మంది టీనేజర్లు, చిన్నపిల్లలు ఉండడం గమనార్హం. రాంచీ ఎయిమ్స్ నిర్వహించిన తాజా సర్వే ప్రకారం అయిదేళ్లకన్నా తక్కువ వయసు ఉన్న పిల్లలు ఇప్పుడు సగటున ప్రతిరోజూ 2 గంటల పాటు మొబైల్ ఫోన్లలో మునిగి తేలుతున్నారు. ఇదే ఇప్పుడు అందరినీ ఆందోళనలో పడవేస్తోంది. చిన్నపిల్లలు రోజంతా నిత్యం మొబైల్ స్క్రీన్లు చూస్తూ గడిపేయడాన్ని అనుమతించడం వల్ల తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయని చిన్న పిల్లల వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

మానసిక ఆరోగ్యం దెబ్బతినడం, ఎదుగుదల సరిగా లేకపోవడం, అన్నిటికీ మించి మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారడం వంటి దుష్పరిణామాలు ఎదురవుతాయని (%ఉష్ట్రవతీవ ఝు౦ ఏశీఅంవనబవఅఎవం%) వారు హెచ్చరిస్తున్నారు. 21వ శతాబ్దంలో స్మార్ట్‌ఫోన్లు చిన్నపిల్లల జీవితాల్లో తప్పనిసరి భాగమయ్యాయని కొంతమంది వాదించవచ్చు. తల్లిదండ్రులు బిజీ లైఫ్‌ల కారణంగా చిన్నపిల్లలు తమను చికాకు పెట్టకుండా ఉండేందుకు వారికి స్మార్ట్‌ఫోన్లు ఇచ్చి ఒక విధంగా వారిని వాటికి అడిక్ట్ అయేలా చేస్తున్నారని చెప్పవచ్చు. వాస్తవానికి కరోనా మహమ్మారి సైతం చిన్నపిల్లలు స్మార్ట్‌ఫోన్లలో మునిగి తేలేలా చేసిందని చెప్పవచ్చు. అప్పట్లో స్కూళ్లు మూతపడ్డం, ఆన్‌లైన్ తరగతులు జరుగుతూ ఉండడంతో పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు తప్పనిసరిగా మారాయి. అయితే అప్పుడు మొదలైన ఈ అలవాటు ఇప్పుడు వారిపట్ల శాపంగా మారుతోంది.

కరోనా ముప్పు తొలగిపోయినప్పటికీ అప్పుడు మొదలైన స్మార్ట్‌ఫోన్ వాడకం అనే జబ్బు ఇప్పుడు కూడా మరింత ప్రమాదకరంగా మారింది.ఓ విధంగా తల్లిదండ్రులు సైతం పిల్లలు తమ జోలికి రావడం లేదు కదా అని వారు ఫోన్లలో మునిగిపోతున్నా చూసీచూడనట్లు ఉండిపోతున్నారు. అయితే ఇప్పుడిప్పుడే దీనివల్ల ఎదురవుతున్న ముప్పును వారు గ్రహిస్తున్నారు.కానీ ఈ జాడ్యాన్ని ఎలా పోగొట్టాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. అయితే వాస్తవానికి పిల్లలు స్మార్ట్‌ఫోన్లు చూడకుండానే పెరగగలరని చిన్నపిల్లల వైద్యనిపుణులు అంటున్నారు. ఎందుకంటే ఈ స్మార్ట్‌ఫోన్లు రాకముందు వారు అలాగే పెరిగి పెద్దవాళ్లయ్యారు కదా అనేది వారి వాదన. అది నిజమే కదా! అప్పట్లో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల, వారి చదువులపట్ల శ్రద్ధ చూపించే వారు. కానీ ఇప్పుడు తల్లిదండ్రులకు ఆ ఓపిక, ఆసక్తి లేదనే చెప్పాలి.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు కనుమరుగయిపోయి, భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం పెరిగిపోవడంతో పిల్లల ఆలనా, పాలన పట్ల వారు శ్రద్ధ చూపడం తగ్గిపోయిందనేది కాదనలేని వాస్తవం. మహా అయితే తమ పిల్లలను వేలు, లక్షల రూపాయలు పోసి పేరున్న కార్పొరేట్ స్కూళ్లకు పంపించి, హాస్టళ్లలో చేర్పించి తమ బాధ్యత తీరిపోయిందని అనుకొంటున్నారు.కానీ తల్లిదండ్రులకు సమానం ఎవరూ కాదు. అందుకే పిల్లలు ఇంటికి వచ్చాక స్మార్ట్‌ఫోన్ పట్టుకుని కూర్చోనివ్వకుండా స్కూల్లో హోంవర్క్ ఏం ఇచ్చారో గమనించి, అది పూర్తి చేసేలా ఓ గంటపాటు పిల్లలతో గడపడం చేస్తే ఆటోమేటిగ్గా స్మార్ట్‌ఫోన్ వ్యసనం దూరమవుతుందని నిపుణులు అంటున్నారు. కొంతమంది తల్లిదండ్రులయితే మూడు నాలుగేళ్ల వయసు పిల్లలు సైతం ఏడవకుండా ఉండడానికి వాళ్ల చేతికి ఫోన్లు ఇచ్చి తమకు తెలియకుండానే వాటికి బానిసలుగా మారేలా చేస్తున్నారు.

అంతేకాదు పిల్లలు ఎప్పుడూ తమ అమ్మానాన్నను అనుకరించాలని చూస్తుంటారు. వాళ్లు స్మార్ట్‌ఫోన్‌లో మునిగి తేలుతుంటే పిల్లలు కూడా అలాగే చేస్తారని కూడా హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఇంట్లో ఉన్న సమయంలో తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్లలో మునిగిపోకుండా పిల్లలతో గడపడం వల్ల వారిలో ఈ వ్యసనాన్ని వీలయినంత మేరకు తగ్గించవచ్చని కూడా నిపుణులు సలహా ఇస్తున్నారు. అంతేకాదు పిల్లలు స్మార్ట్‌ఫోన్‌కు బానిసలుగా మారడం వల్ల జ్ఞాపకశక్తి తగ్గడం, సంతోషం, బాధ లాంటి భావోద్వేగాలు లేకుండాపోవడం లాంటి లక్షణాలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు కూడా అంటున్నారు. ఈ లక్షణాలనే వారి పరిభాషలో 'బ్రెయిన్ రాట్'గా పిలుస్తారు. అంతేకాదు సెల్‌ఫోన్లో కనిపించే హింస, సెక్స్‌కు సంబంధించిన అంశాలను చూడడం వల్ల టీనేజర్లు హింసాప్రవృత్తికి అలవాటు పడడం, నేరాలు పెరిగిపోవడం జరుగుతోందని కూడా వారు హెచ్చరిస్తున్నారు.

మరి దీనికి పరిష్కారం ఏమిటి? ఒకవేళ పిల్లలు స్మార్ట్‌ఫోన్ కోసం మారాం చేస్తే తల్లిదండ్రులు వారిని చదువులవైపు మళ్లేలా చేయాలని, ఫోన్‌లో అందుకు సంబంధించిన అంశాలే చూసేలా జాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా వారిని ఫోన్లలో ఇతర అంశాలు చూడకుండా చేయవచ్చని పిల్లల వైద్యనిపుణులు సూచిస్తున్నారు. చివరగా ఫోన్ ఎప్పటికీ పేరెంట్ కాబోదని, ఒకవేళ అలా మారినా అది తీవ్ర పరిణామాలకే దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. పిల్లలకే కాదు, పెద్దలకు కూడా ఎక్కువగా సెల్‌ఫోన్ చూడడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో నేరాలు పెరగడానికి ఇది కూడా ఓ కారణమని ప్రతి ఒక్కరూ అంటున్నా పట్టించుకోవడం లేదు. 'అతి సర్వత్రా వర్జయేత్' అన్న పెద్దల మాట గుర్తుంచుకుని మసలుకోవడం, కనీసం పిల్లల విషయంలోనైనా జాగ్రతపడడం ఎంతయినా అవసరమని వాళ్లు హెచ్చరిస్తున్నారు. లేదంటే పెను ప్రమాదం తప్పదు.

# నేడు విజయవాడలో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్లింగ్ డ్రైవ్...

## ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్

- పునరుత్పాదక ఇంధన నైపుణ్య కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ముందడుగు
- సౌర, పవన విద్యుత్ రంగాల్లో వేలాది మంది యువతకు నైపుణ్య శిక్షణ
- కార్యక్రమానికి హాజరుకానున్న 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు
- ఏపీఎస్ఎస్‌డీసీ, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈవెంట్



అమరావతి ఆగస్టు 05 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గ్రీన్ వర్క్ ఫోర్స్ విప్లవానికి కేంద్ర బిందువుగా మారేందుకు రాష్ట్రం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు రేపు విజయవాడ నోవాటెల్ హోటల్ లో దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ ఎనర్జీ స్కిల్లింగ్ డ్రైవ్ ను చేపడుతోంది. దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడంతో పాటు సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీ అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ఈ డ్రైవ్ ను నిర్వహిస్తున్నాయి. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో 250కి పైగా పరిశ్రమల ప్రతినిధులు, ముఖ్యమైన అభివృద్ధి భాగస్వాములు హాజరుకానున్నారు. భారతదేశం 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్య లక్ష్యాన్ని సాధించేందుకు వేగంగా అడుగులు వేస్తుండగా... ఆంధ్రప్రదేశ్ ఈ గ్రీన్ వర్క్‌ఫోర్స్ విప్లవానికి కేంద్రబిందువుగా మారనుంది. భారతదేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ క్లీన్ ఎనర్జీ ఆర్థిక వ్యవస్థకు మానవ వనరుల కేంద్రంగా ఎదగనుంది. వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో నైపుణ్య శిక్షణ పునరుత్పాదక ఇంధన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువతకు సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో తయారీ నుంచి ఇన్‌స్టలేషన్, ఆపరేషన్స్, నిర్వహణ వరకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఇది కేవలం నైపుణ్య శిక్షణ కార్యక్రమం మాత్రమే మాత్రమే కాకుండా క్లీన్ ఎనర్జీ, వాతావరణ మార్పులకు తగ్గ నైపుణ్యాల అభివృద్ధికి, పరిశ్రమల వృద్ధికి దోహదపడే విధంగా రూపొందించారు. 2030 నాటికి 160 గిగావాట్ల సోలార్ మరియు విండ్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో మాత్రమే కాకుండా గ్లోబల్ టాలెంట్ ఎగుమతిదారుగా కూడా నిలవనుంది. ఈ సమావేశంలో మూడు హై-ఇంపాక్ట్ ప్యానెల్ డిస్కషన్స్ నిర్వహించనున్నారు. సోలార్, విండ్ పరిశ్రమల దిగ్గజాలు... పాలసీ మేకర్లు, శిక్షణ సంస్థలతో కలిసి డిమాండ్ ఆధారిత, పరిశ్రమల అవసరాలకు తగ్గ వర్క్ ఫోర్స్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ రూపొందించనున్నారు. అదనంగా ప్రైవేట్ సెక్టార్ గ్రీన్ స్కిల్లింగ్ టాస్క్‌ఫోర్స్‌ను కూడా ప్రారంభించనున్నారు.

# ఉత్తర కాశీలో జలప్రళయం... కొట్టుకుపోయిన గ్రామం...



దేవభూమి ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఉత్తరకాశీ జిల్లాలో మంగళవారం సంభవించిన కుండపోత వర్షం (క్లౌడ్ బరస్ట్) పెను విషాదాన్ని మిగిల్చింది. హర్సిల్ సమీపంలోని ధారాలీ ప్రాంతంలో ఆకస్మిక వరద పోటెత్తడంతో ఒక గ్రామం పూర్తిగా కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనలో పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం అందడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ధారాలీ వద్ద ఉన్న ఖీర్ గఢ్ వాగులో నీటిమట్టం ఒక్కసారిగా ప్రమాదకర స్థాయిలో పెరగడంతో వరద నీరు సమీపంలోని మార్కెట్ ప్రాంతాన్ని ముంచెత్తింది. దీనివల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీస్, అగ్నిమాపక శాఖ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), భారత సైన్యం రంగంలోకి దిగాయి. విపత్తు సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ధారాలీ ప్రాంతంలో కుండపోత వర్షం వల్ల జరిగిన నష్టం గురించి తెలిసి చాలా బాధపడ్డాను. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి" అని ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. సీనియర్ అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానని చెప్పారు. "అందరూ క్షేమంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అధికారులు నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. నదులు, వాగుల వద్దకు వెళ్లవద్దని, పిల్లలు, పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా, ఆగస్టు 4 నుంచి ఉత్తరకాశీ, పౌరీ గఢ్వాల్, టెహ్రీ, చమోలీ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఒకరోజు ముందే హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో డెహ్రాడూన్ జిల్లా యంత్రాంగం పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించింది. ముఖ్యమంత్రి ధామి కూడా అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించి సంసిద్ధతను సమీక్షించారు. అయినప్పటికీ ఈ స్థాయిలో నష్టం జరగడం విచారకరం.

# అత్యంత ధైర్యవంతమైన నిర్ణయం..

రాజ్యాంగ తప్పిదానికి పరిష్కారం చూపిన రోజు. భారత యూనియన్‌లో జమ్మూ కశ్మీర్‌కు పూర్తిగా, న్యాయబద్ధంగా ఏకీకరణకు హామీ ఇచ్చిన రోజు. చాలా కాలంగా అశాంతి, హింసతో ప్రభావితమైన ఈ ప్రాంతానికి శాంతిని తీసుకువచ్చి.. ప్రజలకు సమానత్వం, అభివృద్ధికి మార్గాన్ని తెరిచిన రోజు. దేశ నిర్మాణంలో నిర్ణయాత్మక, దార్శనిక నాయకత్వ బలాన్ని చూపించిన రోజు. 2019 ఆగస్టు 5న ప్రధాని మోడీ గారి నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా కాశ్మీర్‌లో దశాబ్దాల అశాంతి ముగిసింది. దేశవ్యాప్తంగా పౌరులతో సమానంగా జమ్మూ కశ్మీర్ ప్రజలకు సమాన హక్కులను నిర్ధారించడం ద్వారా చారిత్రాత్మక అడుగు వేసింది. దశాబ్దాలుగా ఉగ్రవాదం, హింస కాశ్మీర్ యువత ఆకాంక్షలను అణచివేసాయి. ఆర్టికల్ 370 రద్దుతో శాంతికి, సమగ్ర అభివృద్ధికి నాంది.జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాజ్యాంగ హక్కులు కల్పించిన రోజు. 6వ వార్షికోత్సవం సందర్భంగా జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇక జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షాలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశం కావడంతో ఈ చర్చ మొదలైంది. రాష్ట్రపతితో భేటీ తర్వాత అమిత్ షా జమ్మూ కశ్మీర్ నేతలను కలిశారు. దాంతో జమ్మూ కశ్మీర్‌పైనే సమావేశం అయ్యారనే జరిగాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే సీఎం ఒమర్ అబ్దుల్లా మాత్రం వందతులను ఖండించారు. తనకైతే నమ్మకం లేదని, ఏమీ జరగదని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నా అని తెలిపారు.

## కొందరికి డబ్బున్నా పేదలను ఆదుకునేందుకు మనసు రాదు: సీఎం చంద్రబాబు

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్ష నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ, మార్గదర్శుల ఎంపికలో ఎవరినీ బలవంతం చేయకుండా స్వచ్ఛందంగా జరగాలని సూచించారు. "మార్గదర్శుల చిన్న సాయం పేదలకు కొండంత అండగా ఉంటుంది. బంగారు కుటుంబాలకు భావోద్వేగ బంధం, చేయూత అవసరం" అని పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత వంటి సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని, ప్రజల ఆస్తిగా 'జీరో పావర్టీ మిషన్' అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 9,37,913 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు, 1,03,938 మందిని మార్గదర్శులుగా ఎంపిక చేసినట్లు సీఎం తెలిపారు. 10 లక్షల కుటుంబాల అవసరాలను 11 ప్రశ్నల ద్వారా ఏఐ సాయంతో విశ్లేషించగా, 31% మంది ఉద్యోగ అవకాశాలు, 22% మంది వైద్య చికిత్స, 9% మంది చిన్న వ్యాపారాల విస్తరణకు సాయం కోరినట్లు వెల్లడించారు. గ్రామాలు, మండలాల వారీగా దత్తత కార్యక్రమంలో పాల్గొనేందుకు పలువురు ముందుకొస్తున్నారని, తాను 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానని, ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చంద్రబాబు వివరించారు. కొందరు మంచి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుంటారని అన్నారు. మరికొందరు డబ్బు ఉన్నా పేదలను ఆదుకునేందుకు మనసు రాదని అన్నారు. ఇంకొందరికి మనసు ఉన్నా సేవా కార్యక్రమాలు చేసేందుకు తగిన సమయం ఉండదని చంద్రబాబు పేర్కొన్నారు. అటువంటి వారిని గుర్తించి మార్గదర్శనం చేయాలని అధికారులకు సూచించారు. నేడు బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే రేపు మార్గదర్శి అవ్వొచ్చని అన్నారు.

## ఏపీ బలంగా పుంజుకుంటోంది...

హర్షం వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్ మళ్లీ పుంజుకుంది, ఇది ఆరంభం మాత్రమే" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కీలక అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా విజయవాడలో బుధవారం 'ఎంపవరింగ్ ఇండియాస్ గ్రీన్ ఫ్యూచర్' పేరుతో గ్రీన్ స్కిల్లింగ్ సదస్సును నిర్వహించనుంది. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్లింగ్ కార్యక్రమంగా దీన్ని అభివర్ణిస్తున్నారు. ఈ సదస్సు ద్వారా సౌర, పవన విద్యుత్ తయారీ, నిర్వహణ వంటి రంగాల్లో వేలాది మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. స్వనీతి ఇనిషియేటివ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సులో మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు 250 మందికి పైగా పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.

## అమరావతి నిర్మాణంలో భారీ అవినీతి : జగన్

కూడా ఇదే విధంగా అవినీతి జరుగుతోందని, గతంలో తాము రూ.2.49కి కొనుగోలు చేసిన విద్యుత్తును ఇప్పుడు రూ.4.60కి కొనుగోలు చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఈ వ్యత్యాసం వెనుక కూడా పెద్ద మొత్తంలో అవినీతి దాగి ఉందని ఆయన అన్నారు.

**ఎమ్మెల్యేలకు లంచాలు ఇవ్వాల్సి వస్తోందని ఆరోపణ**

జగన్ తన ఆరోపణలను కేవలం అమరావతి ప్రాజెక్టుకే పరిమితం చేయలేదు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు నడపడానికి, ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆరోపించారు. ఇది రాష్ట్రంలో పెట్టుబడులను నిరుత్సాహపరుస్తుందని, పారిశ్రామికాభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని జగన్ అభిప్రాయపడ్డారు. ఈ ఆరోపణలు ప్రస్తుత ప్రభుత్వానికి సవాళ్లుగా మారే అవకాశం ఉంది. ఈ వ్యాఖ్యలపై ప్రభుత్వ వర్గాల స్పందన కోసం అందరూ ఎదురు చూస్తున్నారు.

## జగన్ హయాంలోనే రెడ్‌బుక్ రాజ్యాంగం

తనపై మాత్రం కావాలనే తప్పుడు వార్తలు ప్రచురించడం దుష్ప్రచారానికి నిదర్శనమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో తన నియోజకవర్గం పాలకొల్లులో రూ. 430 కోట్ల అభివృద్ధి పనులు (430 %ఎతీశీతీవ ఎవజవశ్రీశీజూఎవత్ షశీతీఎం%) జరుగుతున్నాయని మంత్రి వివరించారు. ప్రజలకు గృహాలు, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు.

**టిడ్కో గృహాల విషయంలో వైసీపీ తీరుపై తీవ్ర విమర్శ**

"మేము నిర్మించిన టిడ్కో గృహాలపై జగన్ హయాంలో ఒక్క ఇంటికీ రూ. 3.65 లక్షల రుణం తీసుకుని దారి మళ్లించారు" అని ఆరోపించారు. టిడ్కో ప్రారంభోత్సవ సభలో తమను బహిరంగంగా స్టేజ్ నుంచి దింపిన ఘటనను గుర్తు చేస్తూ, అప్పట్లో సాక్షి పత్రిక మౌనం ఎందుకు వహించిందని నిలదీశారు. "మేమే దాడులకు గురయ్యాం. అయినా మాపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టారు. ఇది జగన్ పాలనలోనూ ప్రజాస్వామ్యంపై జరిగిన అతి పెద్ద దాడి" అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## విశాఖ గ్రోత్ హబ్‌లో భాగంగా.. ఏపీలోని ఆ 3 జిల్లాల్లో భూసమీకరణ

స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లలో కొంత విస్తీర్ణం తిరిగి కేటాయించనున్నారు. 2016 వుడా భూసమీకరణ పథకం కింద భూసమీకరణ చేయనున్నారు. ఈ పథకం కింద ఎకరా డీపట్టా భూమిని తీసుకుంటే అందుకు బదులుగా అభివృద్ధి చేసిన 900 గజాల ప్లాట్లు వీఎంఆర్డీఏ అధికారులు రైతులకు అప్పగిస్తారు. అదే పదేళ్లకుపైగా ఆక్రమణలో ఉన్న భూములకు గానూ ఎకరాకు 450 గజాల ప్లాట్లు కేటాయిస్తారు. మరోవైపు భూసమీకరణపై ఆయా గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామసభలలో భూసమీకరణపై ప్రజల నుంచి అధికారులు సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. మరోవైపు భూసమీకరణపై ప్రకటన విడుదలైన నేపథ్యంలో 60 రోజుల్లోగా అంటే సుమారుగా రెండు నెలలోపు ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. ఆ అభ్యంతరాలు, వాటికి సంబంధించిన పత్రాలతో అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని గ్రామాలలో సెప్టెంబరు 4 నుంచి అక్టోబరు 3 వరకు గ్రామసభలు నిర్వహిస్తారు. అలాగే విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గిడిజాలలో సెప్టెంబరు 6న, గోరింటలో సెప్టెంబరు 9న, శొంఠ్యాంలో సెప్టెంబరు పదో తేదీన గ్రామసభలు నిర్వహిస్తారు. బీడీపాలెంలో సెప్టెంబరు 11న నిర్వహించనున్నారు. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం కొవ్వాడలో సెప్టెంబరు 6వ తేదీన.. విజయనగరం జిల్లా డెంకాడ మండలం, భోగాపురం మండలంలోని గ్రామాలలో సెప్టెంబరు 4 నుంచి అక్టోబరు 3 మధ్య గ్రామసభలు జరగనున్నాయి. గ్రామసభలలో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల మీద అక్టోబరు 3 నుంచి 18వ తేదీ వరకూ ఆయా మండలాలో ఎమ్మార్వో కార్యాలయాల్లో విచారణ జరగనుంది.

## ప్రజలను మోసం చేయడమే కూటమి ప్రభుత్వ నైజం: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

### -గోడిలో బాబు షుఌ్యరిటీ మోసం గ్యారెంటీ.



**అల్లవరం, ఆగస్టు5(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అల్లవరం మండలం గోడి గ్రామంలో "బాబు షుఌ్యరిటీ మోసం గ్యారెంటీ " కార్యక్రమం శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ క్యాంప్ కార్యాలయం నందు మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజలను ఏ విధంగా మోసం చేస్తుందో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రబాబు మోసలకు సంబందించి క్యూఆర్ కోడ్ పోస్టర్ను ఆవిష్కరించారు. స్కాన్ చేయడం ద్వారా చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను ప్రజలకు వివరంగా యూట్యూబ్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ ఫోన్ ద్వారా ఈ క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేసి ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా మోసం చేస్తుందో తెలుసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ ,ఎంపీపీ ఇళ్ళ శేషారావు , జడ్పిటిసి సభ్యులు గౌతమిమహేష్ ,వైస్ ఎంపీపీ వడ్డీ గంగ, నాతి శ్రీనివాసరావు, బళ్ళ శ్యామ్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వర రావు ,గ్రామ కమిటీ సెక్రటరీ రేవుశ్రీను ,కడలి ప్రాసాద్ ,జల్లి ఏడుకొండలు,చెవల శ్రీను ,కుక్కల అర్జునరావు,సర్పంచ్ల రాకపు విజయలక్ష్మి , బర్రె సీతారత్నం ,ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి , చింతా రామకృష్ణ ,తిక్కా ప్రసాద్ ,పల్లి జేమ్స్రాజు ,రేవు సుందరరావు, కర్రి వెంకట రామరాజు, సాధనాల శ్రీను, ఈతకోట సతీష్, బొంతు శ్రీను ,పెనుమాల విక్రమ్ నిమ్మకాయల శేఖర్, గుర్రం నాగరాజు ,ఉందుర్తి ప్రసాద్, బొమ్మి ప్రసాద్, మల్లవరపు శ్రీను,బుంగ శేఖర్,బొమ్మి బాలు, నేదునూరి ప్రశాంత్, అకుమర్తి దుర్గారావు వైసీపీ నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాది రైతు ప్రభుత్వం-ఎమ్మెల్యే సత్య ప్రభ



**రౌతులపూడి, ఆగస్టు5 (తెలుగురాష్ట్రం విలేకరి):**

కూటమి ప్రభుత్వం నిరంతరం రైతు సంక్షేమం కొరకు పని చేస్తుందని ప్రత్తిపాడు ఎంఎల్ఏ వరుపుల సత్య ప్రభ రాజా అన్నారు. మంగళవారం రౌతులపూడి మండలం రెండు కిసాన్ డ్రోనులను ఎమ్మెల్యే సత్య ప్రభ రైతు గ్రూపులకు రౌతులపూడి ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఎ. మల్లవరం, మరియు రౌతులపూడి -2 గ్రూపులకు డ్రోన్లను అందజేశారు . ఒక్క యూనిట్ విలువ 9.80 లక్షల రూపాయలు కాగా గ్రూప్ షేర్ 2.00 లక్షల రూపాయలు, 7.84 లక్షలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్లు ఎమ్మెల్యే సత్య ప్రభ తెలిపారు. అధికారులు మండల వ్యవసాయ అధికారి రావు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, మండల తెలుగుదేశం పార్టీనా అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, మాజీ ఎం. పి.పి. ఇటంశెట్టి సూర్య భాస్కర రావు, ఎన్ ఎన్ పట్నం మాజీ సర్పంచ్ లాలం అప్పలనాయుడు, కుమ్మరేగుల టిడిపి నాయకులు పసగడుగుల రమణ, కార్యక్రమం నందు పెద్ద ఎత్తున టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ ఆగస్టు5 (తెలుగురాష్ట్రం విలేకరి):**

స్థానిక డీఎస్ఏ మైదానం వేదికగా జరుగుతున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని మంగళవారం తెల్లవారుజామున జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ఆర్మీ అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ నేటి నుంచి ప్రారంభమై ఆగస్టు 20వ తేదీ వరకు జరిగే ఈ నియామక ర్యాలీ నిర్వాహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల నుంచి సుమారుగా 10వేల మంది అభ్యర్థులు ఈ ర్యాలీలు పాల్గొంటారని ఆయన తెలిపారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన తొలి రోజు ఆర్మీ ర్యాలీలో అభ్యర్థులు పాల్గొన్నారని, వీరందరికీ శారీరక పరీక్షలు పూర్తయిన పిదప శారీరక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి బుధవారం మెడికల్ టెస్ట్ లు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమంతో పాటు సాయంతోనే జీరో పావర్టీ సాధ్యం

### -స్వచ్ఛంధంగా వచ్చిన వాళ్లే మార్గదర్శులు -ఆగస్టు 19 నుంచి పీ4 అమలు

**ఏలూరు,ఆగస్టు 05, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




పేదరిక నిర్మూలనకు చేపడుతున్న జీరో పావర్టీ–పీ4 లక్ష్యం 2029 నాటికి సాకారం అవుతుందని.. ఇదే మొదటి అడుగు అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. మంగళవారం సచివాలయంలో పీ4పై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మెల్యేలు,కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వీడియోకాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ వారితోపాటు జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, సిపివో వాసుదేవరావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సయ్య, పశుసంవర్ధక శాఖ జెడి గోవిందరాజులు, సమగ్ర శిక్షాఅభియాన్ ఎపిసి పంకజ్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో చేపట్టిన పీ4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి పీ4 అమలు చేయాలని నిర్ణయించామన్నారు. "పేదరిక నిర్మూలనలో భాగంగానే పీ4 కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమన్నారు. సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుందన్నారు. డబ్బుతో పాటు. సాయం చేసే వారు కూడా మార్గదర్శులేనని ఆయన పేర్కొన్నారు. బంగారు కుటంబాలకు కావాల్సింది ఎమోషనల్ బాండింగ్, చేయూత మాత్రమే. సీఎస్సార్ నిధులతో బిల్ గేట్స్, వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. వీటికి మించి కుటుంబాలను ఆదుకోవటమే లక్ష్యంగా పీ4 కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.బంగారు కుటుంబాలను ఆదుకోవటంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా వాలంటరీగానే జరుగుతోందన్నారు. ఎక్కడా ఎవరిపైనా బలవంతం లేదు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదు. ఎవరినీ బలవంతం చేయొద్దు. మానవత్వం ఉండే వారే ఇందులో చేరతారన్నారు. మంచి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొందరు వ్యవహరిస్తారన్నారు. ప్రజల మనస్సుల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నిస్తారని, గతంలో జన్మభూమి, శ్రమదానం, నీరు–మీరు ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారన్నారు. నేను ఇలాంటివి పట్టించుకోను. కొందరికి ఆర్థిక వనరులు ఉన్నా పేదల్ని ఆదుకోవడానికి మనస్సు రాదు. కొందరికి మనస్సు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. ఇలాంటి వారిని గుర్తించండి.పీ4 వేదిక ఉందని చెప్పండి. ఆర్థిక అసమానతలు మరింతగా తగ్గాలి. ఇవి పెరిగితే సమాజానికి మంచిది కాదు. ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే రేపు మార్గదర్శి కావచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు అదనపు సాయం పీ4 ద్వారా అందుతుందన్నారు. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనను రేకెత్తించాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకూ 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తి అయిందన్నారు. 1,03,938 మంది మార్గదర్శులను గుర్తించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల బంగారు కుటుంబాలకున్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించామన్నారు. 11 ప్రశ్నలతో వివరాలు నమోదు చేసి ఏఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పిచాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతం మంది తమ చిన్నచిన్న వ్యాపారాలను మరింత పెంచుకోడానికి అవకాశాలు కల్పించాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవటంతో పాటు గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అలాగే ఫండ్ ఏ నీడ్ అనే అంశాన్ని కూడా పీ4 కార్యక్రమంలో పెట్టామన్నారు. ఈ కార్యక్రమం అమలును ప్రతీ మూడు నెలలకు ఓ మారు సమీక్షించుకుంటాం. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో వాలంటరీగా పాల్గొనవచ్చున్నారు. ప్రస్తుతం నేను కూడా మార్గదర్శిగా పేరు నమోదు చేయించుకుని 250 కుటుంబాలను దత్తత తీసుకున్నానని, ఆ కుటుంబాల సంక్షేమం కోసం ప్రణాళికాబద్ధంగా వెళ్తామన్నారు.

# సరిపడా యూరియా నిల్వాలుఎరువుల కొరత రాకుండా ప్రత్యేక పర్యవేక్షణ.

### -వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు నిర్వహించిన టి.సి. లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

**ఏలూరు, ఆగస్టు, 05,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



రాష్ట్రంలో ఏరైతు ఎరువులకోసం ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటడులో ఉన్న ఎరువులు, వాటి సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ కు ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ కు అన్ని సహకార సంస్థల్లో, ప్రైవేట్ కంపెనీల్లో ఎటువంటి కొరత లేకుండా ముందస్తుగానే ఎరువుల నిల్వలు ఉండేలా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల నిల్వస్థితి, డిమాండ్, సరఫరా తదితర అంశాలను వివరించారు. ఖరీఫ్ 2025 సీజన్ కు కావల్సిన ఎరువుల సరఫరాను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు. రైతులు అసత్య ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ప్రతి రైతుకు కావలసిన యూరియాని అందించడం జరుగుతున్నదన్నారు. ఏలూరు జిల్లాలో ఖరీఫ్ సీజన్ మొత్తానికి అనగా జూన్–25 నుంచి అక్టోబర్–25 వరకు 1,18,402 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉన్నదన్నారు. ఆగస్టు నెలలో యూరియా 10183, డిఎపి 3758, ఎన్ పికె. 14772, ఎంఓపి 3280, ఎస్ఎస్ పి 4076, మొత్తం 36,069 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ప్రస్తుతం మార్క్ ఫెడ్, రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్ల దగ్గర 42,456 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు.జిల్లాలోని 118 సహకార సంఘాలు మరియు 10 డిసిఎంఎస్, ప్రైవేట్ డీలర్ల ద్వారా ఎరువులను సరఫరా చేస్తునారన్నారు. జిల్లాలోని రైతులు యూరియాను వ్యవసాయతర అవసరాలకు కాకుండా వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలన్నారు. యూరియాను మోతాదుకు మించి అత్యధికంగా వినియోగించవద్దని సూచించారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను విరివిగా వినియోగించాలని సూచించారు.

# ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 16 వరకు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**చిత్తూరు జిల్లా ఆగస్టు, 05,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 16 వరకు, 21 రోజులు నిర్వహించనున్న కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కాణిపాకం ఆలయ పరిపాలన భవనం లోని సమావేశపు మందిరంలో జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్ మరియు పూతలపట్టు ఎంఎల్ఏ శ్రీ కె.మురళి మోహన్, ఆలయ ఈ.ఓ శ్రీ పెంచల కిషోర్ లతో కలసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయం నందు శాంతి భద్రతలు పరిరక్షించుటకు ప్రత్యేక డిఎస్పి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దేవాలయం ప్రాంగణము, సూపద మండపం, కోనేరు, పార్కింగ్ బస్టాండు ,కళ్యాణ్ కట్ట వద్ద పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామని, ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంతర సంఘటనలు జరగకుండా, దేవస్థానం ఆధ్వర్యంలో సీసీటీవీల ద్వారా నిరంతర పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడెక్కడ ఏ స్థలాల్లో ఉన్నాయని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ఫ్లెక్సీలు, బ్యారికేడ్స్ పటిష్టంగా ఉండాలని తెలిపారు, మా ఆధ్వర్యంలో రెండు డ్రోన్లు కెమెరాలు పనిచేస్తాయని, అలాగే ఆలయం ఆధ్వర్యంలో రెండు డ్రోన్ కెమెరాలు ఉండాలని తెలిపారు. భక్తాదులను అప్రమత్తంగా ఉండుటకు మైకు ద్వారా హెచ్చరికలు జారీ చేయుటకు ప్రత్యేక సౌకర్యాలు ఆలయం అధికారులు కల్పించాలని తెలిపారు. బ్రహ్మోత్సవములు సందర్భంగా దేవస్థాన పరిసర ప్రాంతాలలో పూర్తిస్థాయిలో మద్యపానం నిషేధించుట, మద్యం అమ్మకాలు నిషేధించుట, రాత్రి 8 గంటల పైబడి ఏ ఒక్క మధ్య దుకాణాన్ని తెరవకుండా కలెక్టర్ దృష్టికి తీసుకుని పోయి మద్యం నియంత్రణను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.కలెక్టర్ గారు మాట్లాడుతూ ఆగస్టు 27 నుండి సెప్టెంబరు 16 వరకు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లకు సంబంధించి ఆలయ ఈఓ అధ్యక్షతన సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం చేయడం జరిగిందని, ఈ కమిటీ ద్వారా ప్రాథమిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.ఆలయ ఈవో, విద్యుత్ అధికారులు, ఫైర్ ఆఫీస్ అధికారులు సమగ్రంగాఆలయం వెలుపల, ఆలయంలోపల విద్యుత్ సౌకర్యం ఎలా ఉన్నది, ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నాయో పరిశీలించాలన్నారు, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు నుండి కాణిపాకం వచ్చే రోడ్లకు ఇరువైపులా ముళ్ళ చెట్లు, పొదలను చదును చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, చిత్తూరు ఆర్డిఓ ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రోటోకాల్ నందు ఎమ్మార్వోలను, డిప్యూటీ ఎమ్మార్వోలను విధులు నిర్వహించడానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయుచున్నామని తెలిపారు చిత్తూరు ఆర్డీవో పర్యవేక్షణలో పై కార్యక్రమాలునిర్వహించాలని ఆదేశించారు. ఉత్సవాల నందు ఎలాంటి పొరబాట్లు జరగకుండా జాగ్రత్తగా మీవిధులు నిర్వర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాలు సందర్భంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, అంబులెన్సులు, నైపుణ్యం కలిగిన డాక్టర్లను నియమించాలని %ణవీఎఉ%ని ఆదేశించారు. డిపిఓ ఆధ్వర్యంలో కాణిపాక ఆలయ పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని డిపిఓను ఆదేశించారు. కాణిపాక నగరంలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని,భక్తులకుసురక్షితమైన త్రాగునీరు అందజేయాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ఉభయదారులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని అధికారులను ఆదేశించారు.వినాయక చవితి 27వ తేదీన, రథోత్సవం సెప్టెంబర్ నెల మూడో తేదీన, సెప్టెంబర్ 13వ తేదీన పుష్ప పల్లకి, సెప్టెంబర్ 16వ తేదీన తెప్పోత్సవము కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ఎలాంటి లోటుపాట్లు జరగకుండా జాగ్రత్తగా మీకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు, ఆర్టీసీ బస్సులు అధిక సంఖ్యలో నడపాలని ఆదేశించారు. అనంతరం పత్రికా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 27 నుండి 21 రోజులు అంగరంగ వైభవంగా, నభూతో నభవిష్యతి అన్న రీతిలో శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తుల సౌకర్యార్థం సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. క్యూ లైన్ ను సమర్థవంతంగా నిర్వహించి ఉభయదారులు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా యాత్రకు వచ్చిన భక్తులకు సంతృప్తికర అనుభూతిని అందించే కార్యక్రమాలు చేపడతామన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయ సిబ్బందితో పాటు 20 ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గతంలో బ్రహ్మోత్సవ నిర్వహణలో అనుభవాలను నెమరు వేసుకుని సమస్యలను అధిగమించి సమర్థవంతమైన ఏర్పాట్లు పూర్తి చేయడానికి చర్యలు చేపడతామన్నారు. లక్షలాది భక్తులు నిర్భయంగా, నిశ్చింతగా కాణిపాక బ్రహ్మోత్సవాలకు వచ్చి వరసిద్ధి వినాయకుని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాణిపాక ఆలయ ఈవో పెంచల కిషోర్, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ మరియు ఇంచార్జ్ అడ్మిన్ శ్రీ ఎస్. ఆర్. రాజశేఖర రాజు, ఆలయ ఉత్సవ ఉభయ దారుడు బుజ్జి నాయుడు, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న ఆలయంలో వైభవంగా పవిత్రోత్సవ పూజలు





**ఆత్రేయపురం, ఆగస్టు 5, (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో అర్చకులు ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రోక్షణ, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హెూమాలు, అష్ట కళాశారాధన, మహా స్నపనం, నీరాజన మంత్ర పుష్పాలు తదితర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అలాగే సాయంత్రం స్వస్తి వాచనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హెూమాలు, పవిత్ర ఆరోహణ, నీరాజన మంత్ర పుష్పాలు తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన ముదునూరి సతీష్ వర్మ, పుష్పావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116 విరాళంగా సమర్పించారు. వారికి దేవస్థానం డీసీ చక్రధరరావు స్వామి వారి చిత్ర పటం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



# శక్తి యాప్ తో మహిళలకు రక్షణ కల్పించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం: డి.ఎస్.పి ప్రసాద్

**-శక్తి కార్యక్రమంపై విద్యార్థినీలకు అవగాహన....**




**అమలాపురం, ఆగష్టు5(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మహిళలకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న శక్తి ప్రోగ్రాంలో భాగంగా అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శక్తి ప్రోగ్రాంపై విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఆ పాఠశాల హెచ్ఎం ఎల్ రాణి అధ్యక్షత వహించగా డి.ఎస్.పి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం శక్తి ప్రోగ్రాంను అమలు చేస్తుందని వివరించారు. పిల్లలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు, సైబర్ నేరాలను నియంత్రించేందుకు, వరకట్నం, గృహహింస వేధింపుల నుండి బయటపడేందుకు, మహిళ అక్రమ రవాణాను నిరోధించేందుకు ఈ శక్తి యాప్ ఎంతగానో దోహదపడుతుందని డీఎస్పీ చెప్పారు. ఈ శక్తి యాప్ ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డి.ఎస్.పి సూచించారు. అదేవిధంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సైలు శేఖర్ బాబు, గంగాభవాని, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు స్నాన ఘట్టాలను సిద్ధం చేయాలి

**- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**





**అమలాపురం, ఆగస్టు 5, (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** రాబోయే గోదావరి పుష్కరాలకు జిల్లాలో ఉన్న స్నాన ఘట్టాలకు మరమ్మతులు, నూతన స్నాన ఘట్టాల నిర్మాణం తదితర మౌలిక వసతులపై నియోజకవర్గాల వారీగా అంచనాలను రూపొందించి సమర్పించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ లో మంగళవారం ఆయన ఆర్డీవోలు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి 2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన మరమ్మత్తు పనులు, బేసిక్ మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలవనరుల శాఖ స్నాన ఘట్టాల అభివృద్ధికి, పంచాయతీ రాజ్ స్నాన ఘట్టాల వద్దకు వెళ్లే అప్రోచ్ సిసి రోడ్లు, బీటీ రోడ్లు, తాత్కాలిక పిండ ప్రధాన షెడ్లు, పుష్కర నగర్ ఏర్పాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు, దైవ దర్శనాలకు, స్నాన ఘట్టాలకు వెళ్లే మార్గాల్లో సైనింగ్ బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందుకు అవసరమైన అంచనాలను నియోజకవర్గాల వారీగా రూపొందించాలన్నారు. అదేవిధంగా 2015 పుష్కరాల భక్తుల తాకిడిని, గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని నివేదికలు రూపొందించాలన్నారు. సంబంధిత ఎమ్మెల్యేలు, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు అనుభవాలను, సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ శాఖల వారీగా అంచనాలు రూపొందించాలన్నారు. స్నాన ఘట్టాలను ఏ,బి,సి కేటగిరీలుగా విభజించి ఆయా స్థాయిల్లో భక్తులు తాకిడికి అనుగుణంగా స్పష్టమైన నివేదికలను రూపొందించాలన్నారు. నదీ తీర ప్రాంతంలో ఉన్న ప్రముఖ దేవాలయాల్లో దర్శన ఏర్పాట్లు, డార్మెట్రీలు, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కల్పించాలన్నారు. మత్స్య శాఖ అధికారులు బోట్లను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాల సమయంలో ఘాట్లను రెండు గంటలకు ఒకసారి ఫైర్ ఇంజన్ ద్వారా బ్లీచింగ్ పౌడర్ తో శుభ్ర పరచాలని లేనిపక్షంలో డయేరియా వంటి వ్యాధులు ప్రభలేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం జల్లు స్నాన ఘట్టాలను రేవుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి, ఎస్పీ కృష్ణారావు, డిఆర్ఓ కే.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల తదితర అధికారులు పాల్గొన్నారు



# శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ కి విరాళం

**ఐ పోలవరం ఆగస్టు 05(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఐ పోలవరం మండలం మురమళ్ల గ్రామంలో నిత్య కల్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ కి సోమవారం రాత్రి భక్తుడు విరాళం అందించారు. హైదరాబాద్ వాస్తవ్యులు బొత్స జయ ప్రసాద్ దంపతులు రు 10,116 (పది వేల నూట పదహార్లు) శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్ కి అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం అందించారు. ఆలయ సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి వి. సత్యనారాయణ దాతను అభినందించారు.

# శ్రీ వెంకటేశ్వర డిగ్రీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో క్రైమ్ సైబర్ నేరాలపై అవగాహన సదస్సు...

**అమలాపురం, ఆగష్టు5(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అమలాపురం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుండి వస్తున్న ఫోన్ కాల్స్, చాటింగ్ చేస్తే ఇబ్బందులు తప్పవని అన్నారు. ఈవ్ టీజింగ్ జోలికి విద్యార్థిని విద్యార్థులు ఎవరు పోకూడదని సూచించారు. మహిళలపై నేరాలు నేడు అధికంగా జరుగుతున్నాయని. ప్రతి మహిళ తమ సెల్ ఫోన్లలో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని. ఆపద సమయంలో యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందడం సులభతరం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కే.వి.ఆర్.ఎన్ నరసింహారావు, ప్రిన్సిపల్ కే మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. వీరబాబు, సబ్ ఇన్స్పెక్టర్ కిషోర్, కళాశాల సిబ్బంది యలాంగి వరప్రసాద్, ఎండి శ్రావణి దిలీప్, సంసోన్, వెంకట్ శ్రీనివాస్, వెంకటేష్, అరుణ్, వాణి, దివ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

# బోడసకుర్రులో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ర్యాలీ.



**అల్లవరం, ఆగష్టు5(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లవరం మండలంలోని బోడసకుర్రు గ్రామపంచాయితీ పరిధిల కుంపట్ల కాలనీలో గ్రామ పంచాయతీ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి నాగేశ్వరావు అధ్యక్షతన మంగళవారం మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ లో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సుమారు 200కి పైగా సేవలు సద్వినియోగం చేసుకోవచ్చునని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు అయిల వెంకట నాగేశ్వరరావు, చింతం శ్రీనివాస్, పొట్టుపోతు పోచమ్మ, సొసైటీ డైరెక్టర్ మొయిల గణపతి, దొమ్మేటి రాధాకృష్ణ, గ్రామకమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, పొట్టుపోతు దుర్గారావు, పంచాయితీ కార్యదర్శి బి.ఆదిశంకరం, గ్రామ సచివాలయం ఉద్యోగులు, పంచాయితీ గ్రేడ్ 5 కార్యదర్శి డి.బాబ్జీ, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత ప్రమాణాలతో విధులు నిర్వహించాలి.. ఏఎస్పీ ఏవీ ఆర్వీబీ ప్రసాద్.

**-బిబిసి ఇన్స్టిట్యూట్ కానిస్టేబుల్ విజేతలకు ఘన సత్కారం..**





**అమలాపురం, ఆగష్టు5 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** పోలీస్ కానిస్టేబుల్స్ గా ఎంపికైన అభ్యర్థులు శిక్షణ అనంతరం వారికి అప్పగించిన విధుల్లో ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ ముందుకు సాగాలని డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏఎస్పీ ఏవీ ఆర్వీబీ ప్రసాద్ సూచించారు. పోలీసు వ్యవస్థలో మొదటి మెట్టుగా ఉన్న కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నత లక్ష్యాలను అందుకునేందుకు అవకాశాలను అందిపు చ్చుకోవాలని కోరారు. ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో అమలాపురం బి. బి. సి. ఇన్స్టిట్యూట్ అత్యుత్తమ ఫలితాలను సాధించిన నేపథ్యంలో విజేతలను బిబిసి ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ ఏవీ ఆర్వీబీ ప్రసాద్ మాట్లాడుతూ పోటీ పరీక్షల కోసం దూర ప్రాంతాలకు కోచింగ్ కి వెళ్ళి ,అక్కడ వసతికి, కోచింగ్ లకు డబ్బులు కట్టలేక ఇబ్బంది పడుతున్న వారి కోసం అమలాపురంలో బిబిసి ఇన్స్టిట్యూట్ ను స్థాపించి దానితో పాటు కోచింగ్ అనంతరం పరీక్ష పూర్తయ్యే వరకు రీడింగ్ రూమ్ సౌకర్యం కల్పిస్తూ 11 మంది అభ్యర్థుల విజయానికి బిబిసి ఇన్స్టిట్యూట్ కారణంగా నిలిచింది అన్నారు. దీనికి డైరెక్టర్ రత్న ప్రసాద్ కృషి అభినందనీయం అన్నారు. అందుబాటులో ఉన్న మంచి అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు అందరూ వినియోగించుకుని పోటీ పరీక్షల రంగంలో మీరు ఏ లక్ష్యాన్నైతే ఎన్నుకొన్నారో ఆ రంగంలో మిమ్మల్ని విజేతలుగా తయారు చెయ్యడానికి అత్యుత్తమ ఇనిస్టిట్యూట్ గా బీబీసీ నిలవాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ అత్యుత్తమ ఫ్యాకల్టీ చే బోధనను అందిస్తూ ,కోచింగ్ పూర్తి చేసుకున్న వారి కోసం ప్రత్యేకమైన రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేసి ఫ్రీ వైఫై, ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసి అభ్యర్థుల విజయానికి నిరంతరం బిబిసి కృషి చేస్తుందని, ఈ అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజేతల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# వైసిపి ప్రసార కమిటీ అధ్యక్షుడుగా ప్రసాద్



**అయినవిల్లి, ఆగస్టు 5 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రసార కమిటీ అధ్యక్షుడిగా అయినవిల్లి లంక గ్రామానికి చెందిన గోడి వరప్రసాద్ నియమించినట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. పార్టీ ఆదేశానుశారం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా నియమించిన పి. గన్నవరం వైస్సార్సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ మండల అధ్యక్షులు మేడిశెట్టి శ్రీను పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ కానిస్టేబుల్ గా ఎంపికైన వారికి సత్కారం



**అయినవిల్లి, ఆగస్టు 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):** నేదునూరు గ్రామం నుండి కానిస్టేబుల్ గా ఎంపికైన పులిదిండి ప్రశాంత్ జోగి మౌనిక ని రావి ఫౌండేషన్ నందు సత్కరించారు. ప్రశాంత్ తండ్రి నరసింహమూర్తి మాట్లాడుతూ పోలీసు యూనిఫామ్ వేసుకోవాలని దృఢ సంకల్పంతో కష్టపడి ఈ విజయం సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. జోగి మౌనిక తండ్రి సుధాకర్ శెట్టి మాట్లాడుతూ తనకు పోలీస్ కావాలనే ఆశ ఉండేదని అది తన వల్ల కాలేదని, తమ కుమారుడు కుమార్తె ఇద్దరూ పోలీస్ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నప్పుడు సంతోషంగా అంగీకరించానని మొదటిగా తన కుమార్తె కల నెరవేరిందని ఆనంద వ్యక్తం చేశారు.ఎంపికైన అభ్యర్థులు ప్రశాంత్, మౌనిక మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన ఈ విజయం సాధ్యమైందని అన్నారు. మట్టిలో మాణిక్యాల వలె కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితుల నుంచి తీవ్రమైన పోటీ కలిగిన పరీక్షల్లో విజయం సాధించడం గ్రామానికి గర్వకారణం అని పెద్దలు కొనియాడారు.యువత వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పెద్దలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రావి ఫౌండేషన్ సెక్రటరీ పాలగుమ్మి వెంకటకృష్ణ, సభ్యులు పెచ్చెట్టి వెంకటేష్, మంద వీరభద్రం, అంగర శివ సాయి గౌడ్, మాజీ సర్పంచ్ కామన కృష్ణమూర్తి, అమలాపురం స్వామి వివేకానంద సేవా సమితి కార్యదర్శి గొవ్వాల నాగరాజు వివేకానంద యువత సభ్యులు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

### -ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ సమావేశం డిమాండ్



**ఏలూరు ఆగస్టు 5(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. యూరియా కొరత వలన రైతుల షాపులు చుట్టు తిరగాల్సి వస్తోందన్నారు. యూరియా కొరత నివారించి రైతులకు యూరియా అందించాలని కోరారు. పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలన్నారు. ఉచిత పంటల పథకాన్ని అమలు చేయాలని, అన్ని పంటలకు పంటలకు పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. పంటలు నష్టపోతున్న సందర్భాల్లో రైతాంగానికి బీమా ధీమా కల్పించడం లేదని విమర్శించారు. పంటల బీమా పథకం నిబంధనలు సడలించి రైతులకు పంటల బీమా పరిహారాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కృష్ణా, గోదావరి డెల్టాల శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు సాగు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలని కోరారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకటరావు, లావేటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్పైస్ ఇన్ ను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం ఆగస్టు 5, (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** భీమవరం మండలం చిన అమిరంలో ఆహ్లాకరమైన వాతావరణంలో స్పైస్ ఇన్ (ఈవెంట్ హాల్ ) ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్పైస్ ఇన్ (ఈవెంట్ హాల్ ) ను ఎమ్మెల్యే అంజిబాబు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. ప్రతిఒక్కరూ ప్రశాంతమైన ఆహ్లాదకరమైన వాతారణాన్ని కోరుకుంటారని, శుభకార్యాలకు తదితర ఈవెంట్స్ స్పైస్ ఇన్ ఎంతో బాగుంటుందని అన్నారు. నిర్వాహకులు బుద్దరాజు విజయ్, హారిక వర్మ మాట్లాడుతూ అన్ని రకాల ఈవెంట్స్ కు స్పైస్ ఇన్ ఎంతో ఉపయోకరంగా ఉంటుందని అన్నారు. పొత్తూరి బాపిరాజు, యర్రంశెట్టి శివకృష్ణ, బుద్దరాజు శ్రీనివాస్ రాజు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## 1108 మందార పుష్పాలతో బాలత్రిపుర సుందరి అమ్మవారికి అలంకరణ



**భీమవరం ఆగస్టు 5, (తెలుగురాష్ట్రం విలేఖరి):** శ్రావణమాసం మంగళవారం సందర్భంగా భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి 1108 మందార పుష్పాలతో లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అమ్మవారికి మద్దాల సత్యనారాయణ, లక్ష్మి బ్రహ్మాజీ దంపతులచే పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. అనంతరం తోటకూర కృష్ణ, ఫణి లక్ష్మీ దంపతుల సహకారంతో 1108 మందార పుష్పాలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## 45 రోజుల్లోగా దేగాపురం-కొమరాడ రోడ్డు పనులు పూర్తి

### - రూ.1.14 కోట్లతో దేగాపురం-కొమరాడ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం ఆగస్టు 5, (తెలుగురాష్ట్రం విలేఖరి):** భీమవరం మండలం దేగాపురం నుండి కొమరాడ రోడ్డు పనులకు మంగళవారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శంకుస్థాపన చేశారు. రూ 1.14 కోట్లతో నాబార్డు నిధులతో 1350 మీటర్ల సీసీ రోడ్డు, బిటి రోడ్డును వేస్తున్నామని, నెల 15 రోజుల్లోగా ఈ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అభివృద్ధి పనులను శరవేగంగా చేస్తున్నామని, గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, గ్రామస్థులు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి బాడ్మింటన్ పోటీలకు ఎంపిక




**కడియం, ఆగస్టు 5, (తెలుగురాష్ట్రం విలేఖరి):** కడియం మండలంలోని కడియం గ్రామం నకు చెందిన దాసరి నాగ వెంకట అర్జున్, రాజమండ్రి కి చెందిన ఎం ప్రణీత్ అండర్ - 14 డబుల్స్ బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు కోచ్ నాగుల కొండ వీరభద్రం తెలిపారు ఇటీవల సికింద్రాబాద్ స్కూల్ గేమ్స్ ఐ సి ఎస్ సి ఆంధ్రా తెలంగాణ రీజనల్ బాడ్మింటన్ డబుల్స్ లో అర్జున్ ప్రణీత్ మొదటి స్థానంలో నిలిచారు తమిళనాడు లో సెప్టెంబర్ 24,25 తేదీలలో అర్జున్ ప్రణీత్ లు ఆడాలసిఉంది అర్జున్ తాతయ్య నానమ్మ దాసరి నాగభూషణం సత్యకుమారి ప్రణీత్ తల్లిదండ్రులు ఎం .దీప, చలపతి అభినందనలు తెలిపారు.

## బ్యాడ్మింటన్ కోచ్ క్రీడాకారులు, టిడిపి నాయకులు అంగర వెంకట్ పుట్టినరోజు వేడుకలు



**భీమవరం ఆగస్టు 5, (తెలుగురాష్ట్రం విలేఖరి):** బ్యాడ్మింటన్ కోచ్ క్రీడాకారులు, టిడిపి నాయకులు అంగర వెంకట్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం వారి స్వగృహంలో టీడీపీ నాయకులు వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శాలువ కప్పి సత్కరించారు. టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, సీనియర్ నాయకులు మైలబత్తుల ఐజాక్ బాబు మాట్లాడుతూ స్నేహశీలి సేవాతత్పరులు వెంకట్ అని, పేదవారికి సహాయం చేయడంలో ముందు వరుసలో ఉంటారని, ఆయన క్రీడాకారులుగా ఎంతో అవార్డులు సాధించారని అన్నారు. వెంకట్ మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని కోరుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో చెల్లబోయిన సుబ్బారావు, పాల పెద్ద అబ్బులు, యళ్ళ వెంకటేశ్వరరావు, లంకి చిన్ని, కొండ్రు శ్రీనివాస్, మల్లువలస రాము, మంతి గణపతి, గంధం పెదబాబు, దొంగ వెంకటేశ్వరరావు, మహ్మద్ షాబు, ఎండి ఫిరోజ్, బండి రమేష్ చెల్లబోయిన జయరాజ్, గొలగని రమేష్ తదితరులు పాల్గొన్నారు..


## గవర్నర్ అశోక్ గజపతిరాజుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సత్కారం



**ఏలూరు ఆగస్టు 05, (తెలుగురాష్ట్రం విలేఖరి):** గోవా గవర్నర్ గా బాధ్యతలు చేపట్టి దిల్లీ పర్యటనలో ఉన్న అశోక్ గజపతిరాజును న్యూఢిల్లీలోని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు నివాసంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్ గజపతి రాజుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పుష్పగుచ్చాలు అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జ్ఞాపిక బహుకరించి అశోక్ గజపతిరాజు ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహచర ఎంపీలు పాల్గొన్నారు.

## మిథున్ రెడ్డితో రామచంద్రారెడ్డి ములాఖత్

### -పెద్దారెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



**రాజమహేంద్రవరం, ఆగష్టు 5(తెలుగురాష్ట్రం విలేఖరి):** లిక్కర్ స్కాం కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో మాజీ మంత్రి, మిథున్ రెడ్డి తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం ములాఖత్ అయ్యారు. రామచంద్రారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మిథున్ రెడ్డి తరపున వాదిస్తున్న న్యాయవాది మంగళవారం సెంట్రల్ జైల్లో మిథున్ రెడ్డితో ములాఖత్ అయ్యారు. రామచంద్రారెడ్డి విచేస్తున్న విషయం తెలుసుకుని సెంట్రల్జైల్ వద్దకు వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణగోపాల్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు వంగ గీతా, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్, రుడా మాజీ చైర్పర్సన్ మేడపాటి షర్మిళ రెడ్డి తదితరులు పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జక్కంపూడి రాజాలు మాట్లాడుతూ ప్రభుత్వ కక్షసాధింపు విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. ప్రతిపక్ష పార్టీ గొంతు నొక్కే విధంగా రెండ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు.

## 15 లోపు బంగారు కుటుంబాల మ్యాపింగ్ పూర్తి చేయండి

### -పేదరిక నిర్మూలనే లక్ష్యంగా 'పి.4' పురోగమించాలి : కలెక్టర్



**రాజమహేంద్రవరం, ఆగష్టు 5(తెలుగురాష్ట్రం విలేఖరి):** ఈనెల 15 లోపు బంగారు కుటుంబాల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు దిశా నిర్దేశనం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ 2029 నాటికి పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పి.4 కార్యక్రమం ద్వారా సమాజంలోని ఆర్థిక అసమానతలను తగ్గించి, పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 66 వేల బంగారు కుటుంబాలను గుర్తించాల్సిన లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 60 వేల కుటుంబాలను గుర్తించామన్నారు. ఆయా కుటుంబాలను ఐదు వేల కుటుంబాలకు మార్గదర్శకులను మ్యాపింగ్ చేశామని తెలిపారు. మిగిలిన బంగారు కుటుంబాలను కూడా ఆగస్టు 15 లోపు గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు బిఫోర్ 'నీడ్ బేస్డ్' సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శకుల సమన్వయంతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి 25 కుటుంబాలకు ఒక గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని, నెలలో మూడుసార్లు ముఖ్యమంత్రి స్వయంగా సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో మ్యాపింగ్ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, క్షేత్ర స్థాయిలో సిబ్బందికి తగిన మార్గదర్శకం చేయాలని సూచించారు. బొమ్మూరులోని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఇతర జిల్లా అధికారులతో కలిసి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి టి. సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ భాస్కర్ రెడ్డి, సీపీఓ ఎల్. అప్పలకొండ, జిల్లా బిసి సంక్షేమ అధికారి బి శశాంక, డిఎల్డీవో పి వీణా దేవి, ఏ స్లీవా రెడ్డి, డి ఐ పి ఆర్వో కె లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# ఆదాని కరెంటు మీటర్లను రద్దు చేయండి

## -వామపక్ష, ప్రజాసంఘాల పిలుపు




**టీ.నర్సాపురం, ఆగస్టు 5 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రాష్ట్రంలో ఆదాని విద్యుత్ మీటర్ల వ్యతిరేకంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా టీ. నరసాపురం మండలం సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ జనశక్తి ఆధ్వర్యంలో మాకొద్దు మాకొద్దు అదాని విద్యుత్తు మీటర్లు అంటూ టీ. నర్సాపురం పాత పెట్రోల్ బంకు దగ్గర నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో పత్రికలు ఉద్దేశించి ప్రజా సంఘాల నాయకులు సిపిఐ సాగర్ మాట్లాడుతూ పాత మీటర్లు ఉన్నప్పుడు తక్కువ కరెంట్ బిల్లు వచ్చేదని ప్రస్తుతం కరెంట్ బిల్లు మీటర్ల పుణ్యమా అని 1000 రూపాయలు కరెంట్ బిల్లు వచ్చే షాప 2500 వందలు నుంచి 3000 రూపాయలు కరెంట్ బిల్లు వస్తున్నాయని వ్యాపార వర్గాలు మొత్తుకుంటున్నాయని తెలిపారు. జనశక్తి నాయకులు భాస్కర్ మాట్లాడుతూ తక్షణమే ఆదాని మీటర్లను రద్దు చేయాలని రద్దు చేసే పోరాటంలో మేము సైతం తోడుంటామని పైకొచ్చి కేంద్ర ప్రభుత్వ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలన్నారు. సిపిఎం నాయకులు వెంకటరావు రాష్ట్రంలో వైసిపి పాలనలో 80 కి వచ్చిన స్మార్ట్ మీటర్లు 1750 కోట్ల రూపాయలు లంచాలతో ముందుకొచ్చిందని నాటి వైసిపి ఆదా ప్రజలను ముంచుతోందని, అప్పటి తెలుగు దేశం నారా లోకేష్ ప్రతిపక్ష పార్టీ ఉండి స్మార్ట్ మీటర్లు పెట్టనివ్వొద్దని పెడితే పగలగొట్టండని పిలుపునిచ్చి ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లు కూటమి ప్రభుత్వం పేరుతో షాపులకు, పొలాలకి, ఇళ్ళకి బిగించమని వాళ్లే చెబుతున్నారని ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అధికారం లేనప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక మాట మాట్లాడే రెండు నాలుకల దూరం వీడి స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీను, కొండా రాము, సిపిఐ నాయకులు తాడిగడప జయరాజు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలి

## -విద్యుత్తు ఉపకేంద్రం ముందు ప్రజాసంఘాల ధర్నా



**పోలవరం, ఆగస్టు 5 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని ప్రజల పైన విద్యుత్ బారాలను మోపవద్దని రాష్ట్ర ప్రజాసంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు పోలవరం సబ్ స్టేషన్ ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అధ్యక్షత వహించిన అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్తు బారాలను ప్రజలపై మోపి ఆదానికి సంపద చేకూర్చటం కోసమే చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని విమర్శించారు చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి లోకేష్ బాబు ఏకంగా స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి అని పిలుపు ఇచ్చి నాడు లోకేష్ బాబు స్వయంగా బద్దలు కొట్టిన విషయము రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. కానీ నేడు చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను తీసుకొస్తే లోకేష్ బాబు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం ఏమిటని ప్రశ్నించారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట ఉన్నప్పుడు ఒక మాట ఈ పాలకులకు వెన్నతో పెట్టిన విద్యనని శ్రీనివాస్ విమర్శించారు. ధర్నాను ఉద్దేశించి రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ జిల్లా కార్యదర్శి ఎస్కె భాష మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యుత్తు సంస్కరణ చట్టాన్ని తీసుకొచ్చి ప్రజల పైన భారాలను మోపుతుందని విమర్శించారు. నూతన విద్యుత్ సంస్కరణలో భాగంగానే స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టటం విద్యుత్తు సంస్థలు ప్రైవేటుపరం చేయటం మనకు కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నదని అన్నారు. పాలకులు ప్రజల ప్రయోజనాలు మరిచి ప్రైవేటు పెట్టుబడిదారుల కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వాళ్లకు అప్పచెప్తున్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించి గ్రామాలకు వచ్చిన వారిని వెనక్కి పంపాలని పిలుపునిచ్చారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు కారం భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను హామీలను తుంగలో తొక్కి వేస్తుందన్నారు. అందులో భాగంగానే ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లను బలవంతంగా పెట్టాలని చూస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు ప్రజలకు అధిక భారాన్ని వేస్తాయని ప్రజలపై అధిక భారం వేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఈ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్మించి గత చరిత్రను చంద్రబాబు నాయుడుకి గుర్తు చేస్తామని హెచ్చరించారు. ఈ సభలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు చవులం రాంబాబు, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు బొరగం భూచందర్రావు, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు నడపల ముక్కారెడ్డి ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన 300 మంది ప్రజలు హాజరయ్యారు. ధర్నా అనంతరం అధికారికి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది.

# మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ పై మాసివ్ ర్యాలీ



**దేవీపట్నం, ఆగస్టు 5 (తెలుగురాష్ట్రం విలేకరి):** మంగళవారం ఉదయం దేవీపట్నం మండలం ప్రధాన కేంద్రం ఇందుకూరుపేట గ్రామంలో మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ పై ఇందుకూరుపేట గ్రామ వీధులు నుండి మెయిన్ రోడ్డు మీదుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సల్మాన్ రాజు ఆధ్వర్యంలో మాసివ్ ర్యాలీ నిర్వహించి ప్రచారము చెయడమైనది. గ్రామ ప్రధాన కూడలి యందు మానవహారం నిర్వహించడమైనది. ర్యాలీ అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రజలు అందరు మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 200 రకముల ప్రభుత్వ సేవలను వినియోగించుకోవచ్చును అని మనమిత్ర వాట్సాప్ నెంబరు 95523 00009 కు హాయ్ అని మెసేజ్ పంపితే ఏ రకమైన సేవలు కావాలో అడుగుతుంది అని, తద్వారా కావలసిన సేవను పొందవచ్చునని తెలియచేసారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పిజి. రామకృష్ణ, పరిపాలనాధికారి యం.వెంకటేశ్వరరావు, కార్యాలయపు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు, విద్యార్థులు హాజరు పాల్గొన్నారు

# స్మార్ట్ మీటర్ల నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి




**జీలుగుమిల్లి, ఆగస్ట్ 5 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని ప్రజాసంఘాల ప్రజా వేదిక ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వామపక్ష ప్రజా సంఘాలు ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాని ఉద్దేశించి ప్రజాసంఘాల ప్రజా వేదిక నాయకులు ఈబి చర్ల భూషణం, కారం దారయ్య, తెల్లం దుర్గారావు, కట్టం ముత్యాలరావు మాట్లాడుతూ నాడు ప్రతిపక్షం నేడు కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పగలకొట్టండని ప్రస్తుత మంత్రి కూటమినేత లోకేష్ గతంలో పిలుపునిచ్చారని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో కూటమి ప్రభుత్వం మాట తప్పిందని నమ్మకద్రోహం చేసిందని ఆరోపించారు. సంవత్సర కాలంలో కరెంట్ బిల్లులు పెరిగిపోయి జనం గగ్గోలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాని స్మార్ట్ మీటర్లు పెట్టిన మీటర్లు తొలగించాలని ట్రూ ఆఫ్ ఇంధన సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని అదనపు భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ స్మార్ట్ మీటర్లను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కట్టం నాగేశ్వరరావు, ఎడ్లపల్లి నాగేశ్వరరావు, కరక నాగన్న, డోల నరసారావు, కొప్పుల నాగరాజు, కారం బుజ్జి, వీరంకి దుర్గారావు, చిట్టిబొమ్మ కొండలరావు, సిరిబత్తుల, సీతారామయ్య, నేలటూరి అప్పారావు, రవికుమార్, సోదం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన



**పోలవరం, ఆగస్టు5 (తెలుగురాష్ట్రం విలేకరి):** పోలవరం మండలం పట్టిసీమ జెడ్పీ ఉన్నత పాఠశాలలోపోలీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం మంగళవారం పోలవరం పోలీసులు ఫోక్సో చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీ రక్షణ మా కర్తవ్యం శక్తి యాప్పై అవగాహన మాదక ద్రవ్యాల దుర్వినియోగం నివారణ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ సైబర్ క్రైమ్ కెరియర్ గైడెన్స్ గురించివిధ్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో సిఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్, మహిళా పోలీస్ నాగలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

**జీలుగుమిల్లి ఆగస్టు 5 (తెలుగు రాష్ట్రం విలేఖరి)** వర్కింగ్ జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు, నూతన అక్రిడేషన్లు, ఇంటి స్థలాలు మంజూరు సంక్షేమ పథకాలను అందించాలని వర్కింగ్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులు తహసిల్దార్ ఉదయ్ కుమార్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే జిల్లా నాయకులు కోలా రాము మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఏజెన్సీలో ఉన్న జర్నలిస్టుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని వారికి ప్రత్యేక ప్రాతిపదికన గుర్తించి ఇంటి స్థలం చెల్లింపులు లేని కుటుంబ సభ్యులు మొత్తానికి హెల్త్ ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. ఉన్నత విద్య కొరకు వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలందరికీ కార్పొరేట్ పాఠశాలలో కళాశాలలో ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మద్దిశెట్టి ఏసుబాబు, పాముల వరప్రసాద్, బొంతు రామకృష్ణ, బొంతు వెంకట రామారావు, బొలగాని సత్యనారాయణ, క్రొవిడి ప్రసాద్, బొంతు రాంబాబు, చేపల లక్ష్మణ్, లక్ష్మయ్య, సోదెం పోసి బాబు, నక్కా రవి, దారా మనోజ్, కడిమి సాయి, బట్టు సందీప్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లు వద్దంటూ వామపక్ష ప్రజా సంఘాల నిరసన



**చింతలపూడి, ఆగస్టు 5 (తెలుగురాష్ట్రం విలేకరి):** స్మార్ట్ మీటర్లు వద్దు - విద్యుత్ శాఖ మీటర్ల ముద్దు అంటూ చింతలపూడి మండల కేంద్రంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆదాని స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చింతలపూడి బోసు బొమ్మ సెంటర్ నుండి ప్రదర్శనగా బయలుదేరి విద్యుత్ ఏడి ఆఫీస్ ముందు బైఠాయింపు జరిపారు. ఆనాడు ఆదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన నేటి ప్రభుత్వం వారి బాటలోనే పైనిస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వినియోగదారులపై భారం మోపటానికి, విద్యుత్ సంస్థను ప్రైవేట్ వారికి అప్పగించడానికి కుతంత్రాలు పన్నుతున్నాయని నాయకులు ప్రసంగించారు. వామపక్షపార్టీ నాయకులు పి. పాండురంగారావు, కే.గురవయ్య, రంగనాథులు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడారు. రైతు సంఘం నాయకులు పి. సోమశేఖర్, కే. చంద్రశేఖర్ రెడ్డి, దంతా కృష్ణ, కాలేషా స్మార్ట్ మీటర్ల వల్ల రైతాంగానికి జరిగే నష్టాలను వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లాజరు, సులేమాన్, మహిళా సంఘం నాయకులు ఎం. వరలక్ష్మి, అనురాధ, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు. పికెటింగ్ అనంతరం విద్యుత్ శాఖ అధికారికి వెయ్యి సంతకాలతో కూడిన వినీత పత్రాన్ని అందించారు.

# రామాలయ నిర్మాణానికి విరాళం



**పోలవరం, ఆగస్టు5 (తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం పంచాయతీ పాతపోలవరం గ్రామంలో పురాతన రామాలయ పునర్నిమాణానికి మంగళవారం దాతలు విరాళాలందజేశారు. భీమవరం మండలం తాడినాడ దాత గాదిరాజు శరత్రాజు సుకన్య దంపతులు 50,000, వైజాగ్ వాసులు గోలి గణేష్ దంపతులు 25,000 ఆలయ కమిటీ సభ్యులు దేవాబత్తుల నాగదేవికి అందజేశారు. ఇతర దాతల విరాళాలతో కలిపి 2 లక్షల రూపాయల విరాళాలను మండల పరిషత్ అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి చేతులు మీదగా ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఆలయ పునర్నిమాణానికి ఉపయోగించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సూరవరపు వీరన్న, బొడ్డు రాంబాబు, గుల్లిపల్లి శివ, దేవాబత్తుల నాగరాజు, దేవాబత్తుల రాంబాబు, పట్నాల నారాయణరావు, సూరవరపు తాతయ్య, అప్పారావు, సూరిబాబు, సురేష్, కిరణ్ రంగా, అయ్యప్ప భజన బృందం మహిళలు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ప్రాజెక్టు అధికారి

**దేవీపట్నం, ఆగస్టు 5(తెలుగు రాష్ట్రం విలేఖరి):**



ఏజెన్సీలో వివిధ వ్యాధులతో వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవీపట్నం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. ముందుగా ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారులు ఎంతమంది ఉన్నది ముందుగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కొనియాడారు. వైద్యాధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఉన్నది అడిగారు. మలేరియా ప్రభలకుండా ఎక్కడికక్కడ మలేరియా మందులు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది రోగులు ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో ఉన్నది ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అటెండెన్స్ రిజిస్టర్ ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు.

# జర్నలిస్టులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

## -ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వైస్ ప్రెసిడెంట్ అజాద్

**చింతలపూడి, ఆగస్టు 5 (తెలుగురాష్ట్రం విలేకరి):**



ఎన్నికల్లో జర్నలిస్ట్ ల సంక్షేమానికి పాటు పడతాం అన్న కూటమి ప్రభుత్వం హామీ లను నెరవేర్చాలని జిల్లా ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ కె అజాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్,ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ల పిలుపు మేరకు ఆగస్ట్ ఐదవ తేదీ జర్నలిస్ట్ ల కోర్కెల దినోత్సవం సందర్భంగా మంగళవారం చింతలపూడిలో ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సభ్యులు నిరసన తెలిపారు. జర్నలిస్ట్ ల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వైస్ ప్రెసిడెంట్ అజాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పాత అక్రిడేషన్ ల పొడిగింపు కాకుండా కొత్త వాటిని జర్నలిస్ట్ లందరికీ మంజూరు చేయాలని హెల్త్ స్కీమ్ అమలు లో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా పునరుద్ధరణ, జర్నలిస్టు అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇంచార్జి తహసిల్దార్ నజీముల్లా షా కు వినతి పత్రం జర్నలిస్ట్ లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా యూనియన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తుమ్మలపల్లి సతీష్, సీనియర్ పాత్రికేయులు కె ఎస్ ఎస్ వీరయ్య, షేక్ అమీర్ పాషా, పాత్రికేయులు యం. కృపావరం లతీఫ్, శ్రీనివాసరావు, నాగేంద్ర, సంజయ్, బాలు, సురేష్, పవన్, వెంకట్, రాంబాబు, సుధాకర్, ప్రసాద్, సునీల్, జి.సత్యనారాయణ, రాజా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బౌలింగ్‌లోనే కాదు.. మాటల్లోనూ మనోడు సిరాజ్

భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన ప్రతిష్ఠాత్మక ఆండర్సన్-టెండూల్కర్ టెస్ట్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి, టీమిండియాను గెలిపించిన బౌలర్లలో మహ్మద్ సిరాజ్ ముందున్నాడు. అయితే సిరీస్ గెలిచిన ఆనందంలో ఉన్న సిరాజ్‌ను ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు, సిరాజ్ చాలా కూల్‌గా, స్ట్రైట్ ఫార్వార్డ్‌గా సమాధానం ఇచ్చి తన నోరు మూయించాడు. ఓవల్ టెస్టులో ఇంగ్లాండ్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి, సిరీస్‌ను 2-2తో సమం చేసిన తర్వాత, మహ్మద్ సిరాజ్ ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారాడు. ఈ సిరీస్‌లో అద్భుతమైన బౌలింగ్ చేసి, చివరి మ్యాచ్‌లో 5 వికెట్లు తీసి టీమ్ ఇండియాను గెలిపించాడు. మ్యాచ్ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చిన సిరాజ్‌కు ఒక జర్నలిస్ట్ నుండి ఊహించని ప్రశ్న ఎదురైంది.



ఈ సిరీస్ గురించి అడిగితే బాగుండేది కానీ, జర్నలిస్ట్ మాత్రం గతంలో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ గురించి అడిగాడు. ఆ ప్రశ్న విన్న సిరాజ్ నవ్వుతూ చాలా ప్రశాంతంగా.. "సార్, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కూడా నేను 20 వికెట్లు తీశాను. ఆ సిరీస్‌లో జస్సీ భాయ్ అద్భుతంగా బౌలింగ్ చేస్తుంటే, నా పని తనకు సహకారం అందించడమే" అని చెప్పాడు. సిరాజ్ ఇచ్చిన ఈ కౌంటర్ జవాబుతో ఆ జర్నలిస్ట్ ఒక్కసారిగా సైలెంట్ అయిపోయాడు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో సిరాజ్ అభిమానులు అతడి తెలివైన సమాధానానికి ఫిదా అయ్యారు.

ఓవల్ టెస్టులో ఐదు వికెట్లు తీసిన సిరాజ్, ఈ సిరీస్‌లో మొత్తం 23 వికెట్లు పడగొట్టి, సరికొత్త రికార్డును సృష్టించాడు. విదేశీ గడ్డపై ఒక టెస్ట్ సిరీస్‌లో 20 కన్నా ఎక్కువ వికెట్లు తీసిన మూడవ భారత బౌలర్‌గా నిలిచాడు. అంతకుముందు ఈ ఘనత కపిల్ దేవ్, జస్ప్రీత్ బుమ్రా మాత్రమే సాధించారు. సిరాజ్ అంకితభావం, కష్టపడే తత్వాన్ని చూసి మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ చాలా సార్లు మెచ్చుకున్నారు. టీమ్ కోసం సిరాజ్ తన సర్వస్వాన్ని పణంగా పెడతాడని కోహ్లీ ఇప్పటికే చాలా సందర్భాల్లో చెప్పారు. ఈ సిరీస్‌లో సిరాజ్ చేసిన ప్రదర్శన కోహ్లీ మాటలను నిజం చేసింది.ఓవల్ టెస్ట్ చివరి రోజు, ఇంగ్లాండ్ గెలవడానికి కేవలం 6 పరుగులు కావాల్సిన సమయంలో, సిరాజ్ గస్ అట్కిన్సన్‌ను క్లీన్ బౌల్డ్ చేసి భారత్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. అంతకుముందు నాలుగో రోజు క్యాచ్ మిస్ చేసినందుకు విమర్శలు ఎదుర్కొన్న సిరాజ్, ఈ బౌలింగ్‌తో తనపై వచ్చిన విమర్శలన్నింటికీ సమాధానం ఇచ్చాడు. చివరి సెషన్‌లో సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ కలిసి ఇంగ్లాండ్ బ్యాటింగ్‌ను కూల్చి, మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు.

# శుభ్మన్ గిల్‌కు 2 మద్యం బాటిళ్లు ఎందుకిచ్చారో తెలుసా..

భారత క్రికెట్‌కు నవశకం మొదలైంది. ఇంగ్లాండ్‌తో జరిగిన 5 టెస్టుల సిరీస్‌లో యువ కెప్టెన్ శుభ్ మన్ గిల్ నాయకత్వంలో టీమిండియా 2-2తో సిరీస్ ను డ్రా చేసుకొని చరిత్ర సృష్టించింది. ఓవల్‌లో జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత గిల్ ను 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు వరించింది. ఈ సందర్భంగా అతనికి ఒక పతకంతో పాటు, ప్రత్యేక బహుమతిగా రెండు వైన్ బాటిళ్లు లభించాయి. ఇది ఇంటర్నెట్ లో చర్చనీయాంశంగా మారింది.




## గిల్ అద్భుత ప్రదర్శన..

ఈ సిరీస్‌లో శుభ్ మన్ గిల్ బ్యాటింగ్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఇంగ్లాండ్ గడ్డపై మొట్టమొదటిసారిగా కెప్టెన్‌గా అడుగుపెట్టిన గిల్, బ్యాట్‌తోనే తన సత్తా చాటాడు. ఐదు టెస్టుల్లో మొత్తం 754 పరుగులు చేసి, ఈ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇందులో నాలుగు సెంచరీలు కూడా ఉన్నాయి. ఎడ్జ్ బాస్టన్ టెస్టులో ఏకంగా 269, 161 పరుగుల చొప్పున రెండు అద్భుతమైన ఇన్నింగ్స్ లు ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

## రెండు వైన్ బాటిళ్లు ఎందుకు?

సాధారణంగా భారత గడ్డపై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లేదా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు గెలిచిన వారికి నగదు బహుమతులు లేదా చెక్కులు ఇస్తుంటారు. కానీ ఇంగ్లాండ్ లో సంప్రదాయం ప్రకారం వైన్ బాటిళ్లు లేదా షాంపేన్‌ను బహుమతిగా ఇస్తారు. ఈ సిరీస్ లో గిల్ రెండుసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును, ఒకసారి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. దీంతో అతనికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుతో పాటు మరో రెండు ఖరీదైన వైన్ బాటిళ్లు కూడా లభించాయి. వీటిలో ఒకటి చాపెల్ డౌన్ బ్రట్ స్పార్క్లింగ్ వైన్ అని, దీని విలువ దాదాపు రూ.14,000 వరకు ఉంటుందని తెలుస్తోంది. ఇంగ్లాండ్‌లో ఈ వైన్ చాలా పేరుగాంచింది.

## గిల్‌కు గంభీర్, బ్రెండన్ మాక్ కలమ్‌ల ప్రశంసలు..

ఈ సిరీస్‌లో అద్భుతంగా ఆడినందుకుగాను ఇంగ్లాండ్ ప్రధాన కోచ్ బ్రెండన్ మాక్ కలమ్ గిల్‌ను "ప్లేయర్ ఆఫ్ ది సిరీస్"గా ఎంపిక చేశాడు. ఈ సందర్భంగా టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ కూడా గిల్ ప్రదర్శనపై ప్రశంసలు కురిపించాడు. ఒక యువ కెప్టెన్‌గా ఇంత ఒత్తిడిలో కూడా అద్భుతమైన ప్రదర్శన కనబరచడం చాలా గొప్ప విషయం అని గంభీర్ అన్నాడు. ఒక కోచ్‌గా, కెప్టెన్‌గా ఈ సిరీస్ డ్రా కావడం ఇద్దరికీ ఒక పెద్ద విజయంగా నిలిచింది. ఈ సిరీస్ తో శుభ్ మన్ గిల్ కు ఒక గొప్ప భవిష్యత్తు ఉందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## గిల్ కు ఇచ్చిన పతకంపై ఏమి రాసి ఉంది?

గిల్ తన ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ పతకంతో ఫోటో దిగాడు. ఎత్తైన భవనంపై ఈ సెల్ఫీని తీసుకున్నాడు. ఈ పతకం ఒక వైపున రోథెసే టెస్ట్ సిరీస్ అని రాసి ఉంది. మరోవైపు ఇంగ్లాండ్ vs ఇండియా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అని ముద్రించారు. ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా శుభ్‌మాన్ గిల్ అద్భుతంగా రాణించాడు. ఇంగ్లాండ్ గడ్డపై కెప్టెన్‌గా అతను ఇంత బాగా బ్యాటింగ్ చేస్తాడని ఎవరూ అనుకోలేదు. ఎందుకంటే అతని సాంకేతిక లోపాలు అందరికీ తెలుసు. కానీ IPL సమయంలో, ఈ ఆటగాడు తన బలహీనతను బలంగా మార్చుకున్నాడు. ఆ తర్వాత బ్రిటిష్ గడ్డపై చరిత్ర సృష్టించాడు.

# ఓవల్ టెస్ట్‌తో కెరీర్ క్లోజ్..

## ఇంగ్లండ్‌లో టీమిండియా ప్లేయర్‌కు ఊహించని షాక్.. రిటైర్మెంట్ ప్లాన్..?




ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల ఉత్కంఠభరితమైన టెస్ట్ సిరీస్ ఎట్టకేలకు ముగిసింది. ఐదు మ్యాచ్‌లు అంటే అన్ని టెస్ట్‌లు ఐదవ రోజున ముగిశాయి. ఇటీవలి సంవత్సరాలలో ఇది అత్యుత్తమ సిరీస్. సోమవారం (ఆగస్టు 4) ఓవల్‌లో జరిగిన ఐదవ టెస్ట్ చివరి రోజున భారత్ ఉత్కంఠభరితమైన విజయాన్ని సాధించింది. ఈ విధంగా, సిరీస్‌ను 2-2తో డ్రాగా ముగించింది. ఇందులో చాలా మంది ఆటగాళ్ళు బాగా రాణించారు. అయితే కొంతమందికి ఈ పర్యటన నిరాశపరిచింది.

ఇంగ్లాండ్ లేదా ఆస్ట్రేలియా పర్యటన టీం ఇండియాలోని కొంతమంది ఆటగాళ్లకు ఎల్లప్పుడూ మంచిది కాదు. ఇది వారి కెరీర్‌పై నీలిమేఘంలా మారింది. అక్కడ నిరాశపరిచే ప్రదర్శన తర్వాతే వారి కెరీర్ ముగుస్తుంది. ఇది చాలా మంది కీలక ఆటగాళ్లతో జరిగింది. రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్, ఆర్‌పి సింగ్, రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి పెద్ద ఆటగాళ్ళు ఇంగ్లాండ్ లేదా ఆస్ట్రేలియాలో తమ చివరి టెస్ట్ మ్యాచ్ ఆడారు. ఇప్పుడు ఇది మళ్ళీ జరగవచ్చు. ఈసారి ఆల్ రౌండర్ కెరీర్ ముగియవచ్చు.

### ఈ ఆటగాడు పదవీ విరమణ చేయాల్సి రావొచ్చు..

ఇక్కడ మనం 33 ఏళ్ల ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ గురించి మాట్లాడుతున్నాం. ఈ పర్యటన అతనికి మరచిపోలేనిది. అతను చివరిసారిగా టీం ఇండియా తరపున ఆడి ఉండవచ్చు. రెండేళ్ల తర్వాత శార్దూల్‌కు టెస్ట్ ఆడే అవకాశం లభించింది. అతను టీం ఇండియా ప్రణాళికలకు దూరంగా ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన తర్వాత, అతను ఇంగ్లాండ్ పర్యటన కోసం జట్టులోకి వచ్చాడు, కానీ అది అతనికి నిరాశపరిచింది.

### ఇంగ్లాండ్‌లో ఘోరంగా విఫలం..

సిరీస్‌లోని మొదటి టెస్ట్‌లో అతనికి అవకాశం లభించింది. లీడ్స్‌లో అతను ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు. బ్యాటింగ్‌లో అతను 1, 4 పరుగులు మాత్రమే సాధించాడు. బౌలింగ్‌లో, అతను రెండవ ఇన్నింగ్స్‌లో 2 వికెట్లను సాధించాడు. ఈ దశ శార్దూల్‌కు డు ఆర్ డై పరిస్థితి. లీడ్స్ టెస్ట్ మ్యాచ్ తర్వాత అతన్ని జట్టు నుంచి తొలగించారు. బర్మింగ్‌హామ్, లార్డ్స్‌లో ఆడలేకపోయాడు. అతను మాంచెస్టర్ టెస్ట్‌లో తిరిగి వచ్చాడు. కానీ, ఇది కూడా అతనికి మర్చిపోలేనిది. అతను మొదటి ఇన్నింగ్స్‌లో 41 పరుగులు చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆ తర్వాత, అతను బౌలింగ్‌లో 55 పరుగులు ఇచ్చాడు. అతను ఒక్క వికెట్ కూడా పడగొట్టలేదు. ఈ విధంగా, రెండు టెస్ట్‌లలో 46 పరుగులు చేయడమే కాకుండా, అతను 2 వికెట్లు మాత్రమే తీయగలిగాడు.

### శార్దూల్ చారిత్రాత్మక విజయాలకు సాక్షి..

2018లో భారత్ తరపున శార్దూల్ తన తొలి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత కొన్ని చిరస్మరణీయ మ్యాచ్‌లలో తన వంతు పాత్ర పోషించాడు. 2021-22లో ఇంగ్లాండ్ పర్యటనలో అతను చాలా విజయవంతమయ్యాడు. 3 మ్యాచ్‌ల్లో 2 హాఫ్ సెంచరీల సహాయంతో 122 పరుగులు చేశాడు. దీంతో పాటు, అతను ఏడు వికెట్లు కూడా తీసుకున్నాడు. అంతకుముందు, 2021లో బ్రిస్బేన్‌లో జరిగిన చారిత్రాత్మక విజయంలో శార్దూల్ కీలక పాత్ర పోషించాడు. బౌలింగ్‌లో 3, 4 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు, బ్యాటింగ్‌లో 67, 2 పరుగుల ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇప్పటివరకు 13 టెస్ట్ మ్యాచ్‌ల్లో 33 వికెట్లు పడగొట్టాడు. ఇది కాకుండా, అతను 377 పరుగులు చేశాడు. శార్దూల్ వయస్సు, ఫామ్‌ను చూస్తే, అతని టెస్ట్ కెరీర్ ఇప్పుడు ముగిసినట్లు అనిపిస్తుంది.

# టెస్ట్ ఫార్మాట్‌కు పనికిరాడని తేల్చేశారు.. గుడ్ బై చెప్పాలంటూ విమర్శలు.. కట్‌చేస్తే..

సాధారణంగా మనం చూసే గౌతమ్ గంభీర్ చాలా కఠినమైన, దూకుడు స్వభావం ఉన్న వ్యక్తి. మైదానంలో అయినా, బయట అయినా ఆయన ఎప్పుడు భావోద్వేగాలను బహిరంగంగా చూపించరు. అందుకే ఆయనను "సీరియస్ గంభీర్" అని కూడా పిలుస్తుంటారు. కానీ, ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి టెస్టు మ్యాచ్ తర్వాత ఆయనలో ఇంతకు ముందెన్నడూ చూడని ఒక కోణం బయటపడింది.



లండన్‌లోని ఓవల్ మైదానంలో జరిగిన ఐదో టెస్టులో భారత జట్టు సంచలనాత్మక విజయం సాధించిన తర్వాత, డ్రెస్సింగ్ రూమ్‌లో గంభీర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జట్టు విజయాన్ని చూసి ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆనందంతో బిగ్గరగా అరుస్తూ, బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్‌ను గట్టిగా కౌగిలించుకున్నారు. అనంతరం యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఆప్యాయంగా తల మీద తట్టి, గట్టిగా హత్తుకున్నారు. ఈ దృశ్యం క్రికెట్ అభిమానుల హృదయాలను కదిలించింది.ఎఈ గెలుపు గంభీర్‌కు ఎందుకంత ముఖ్యమైంది? టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గంభీర్ ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. సీనియర్లు లేని యువ జట్టుతో ఆయన మొదలుపెట్టిన ప్రయాణం అంత సులభం కాదు. న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో వైట్ వాష్, ఆస్ట్రేలియా పర్యటనలో ఓటమి వంటి పరాజయాలతో ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. టెస్ట్ క్రికెట్‌కు ఆయన సరైన కోచ్ కాదనే విమర్శలు కూడా వచ్చాయి. అయితే, ఈ ఒత్తిళ్ల మధ్య ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను గెలిచి 2-2తో సిరీస్‌ను డ్రా చేయడం గంభీర్, యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇద్దరికీ పెద్ద ఊరట. ఎందుకంటే ఈ విజయం కేవలం ఒక మ్యాచ్ గెలుపు మాత్రమే కాదు. ఇది యువ జట్టుపై ఉన్న నమ్మకాన్ని, గంభీర్ కోచింగ్ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. అందుకే ఆనందంతో గంభీర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో, అది వైరల్ అయింది. కఠినంగా ఉండే గంభీర్ ఇంత భావోద్వేగానికి లోనవడం చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు. ఇది కోచ్‌గా ఆయన పడ్డ శ్రమ, ఒత్తిడి, జట్టు విజయం పట్ల ఆయనకున్న అంకితభావం ఎంత గొప్పదో చూపిస్తోంది. ఇది కేవలం గెలుపును ఆనందించడం మాత్రమే కాదు, దాని వెనుక ఉన్న కృషిని గుర్తుచేసుకుంటూ పడ్డ ఆనంద భాష్పాలు.

# చీరలో కాశ్మీర్ యాపిల్..

చైల్డ్ ఆర్టిస్ట్‌గా బాలీవుడ్‌లో 1997లోనే ఎంట్రీ ఇచ్చిన కాశ్మీర్ యాపిల్ ఫాతిమా సనా షేక్ 'దంగల్'తో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకుంది. ఆమీర్ ఖాన్ కూతురు పాత్రలలో దంగల్‌లో కనిపించిన ఫాతిమా సనా షేక్ నటనతో మెప్పించింది ఆమీర్ ఖాన్ కూతురు పాత్రలో నటించిన ఫాతిమా ఆ వెంటనే ఆయనకు జోడీగా హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఫాతిమా సనా షేక్ సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం మాత్రమే కాకుండా, బోల్డ్ పాత్రల్లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుంది. రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. నెట్టింట ఈమె షేర్ చేసే ఫోటోలు వీడియోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఫాతిమా సనా షేక్ తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఈసారి చీర కట్టిన ఫాతిమా చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని ఇప్పటికే పలు సార్లు నిరూపితం అయ్యింది. ఎప్పుడూ మోడ్రన్ డ్రెస్‌లో ఆకట్టుకునే ఫాతిమా ఈసారి అంతకు మించి అన్నట్లుగా చీర కట్టులో కనిపిస్తుంది.





## అనుపమ 'పరదా' నుంచి..
# మెలోడీ పాట విడుదల

అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పరదా' (%ఞుతీస్తుఎస్త్రు%). ఈ చిత్రానికి సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి 'యత్ర నార్యస్తు పూజ్యంతే' అనే పాటను విడుదల చేశారు చిత్ర యూనిట్. ఈ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి మరో పాటు విడుదల చేశారు. 'ఎగరేయి నీ రెక్కలే' అంటూ సాగే బ్యూటీఫుల్ మెలోడీ పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు గోపీ సుందర్ సంగీతం అందించగా.. రితేశ్ జీ రావు ఆలపించారు. వనమాలి ఈ పాటకు సాహిత్యం అందించారు. ఈ చిత్రంలో సీనియర్ నటి సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆగస్టు 22వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది.



## నిజాయతీ గల వ్యక్తిగా
# నన్ను గుర్తిస్తే చాలు
## జూనియర్ ఎన్టీఆర్

'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో మార్కెట్ పెంచుకున్న జూనియర్ ఎన్టీఆర్... ఇప్పుడు 'వార్ 2'తో బాలీవుడ్ లోకి డైరెక్ట్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఈ సినిమా ఈనెల 14న రిలీజ్ కాబోతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తారక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమాలకు సంబంధించి... కుటుంబ వారసత్వం విషయంలో ఏం జరుగుతుందో తనకు తెలియదని, తాను ఎలాంటి ప్లాన్స్ వేసుకోలేదని చెప్పాడు. అయితే తాను నటించే చిత్రాలతో తనను గుర్తుంచుకోవాలనే ప్రయత్నం మాత్రం చేస్తానని తెలిపాడు. ఒక నటుడిగా కంటే ఒక నిజాయతీ గల మనిషిగా తనను గుర్తించాలని కోరుకుంటున్నట్టు చెప్పాడు. ఎమోషన్స్ తో కూడిన నిజాయతీ గల వ్యక్తిగా తనను గుర్తిస్తే చాలని తెలిపాడు.


## కాలం అక్కడే ఆగిపోతే
# బాగుండేది..
## సీనియర్ హీరోయిన్ నిరోషా!

**తన కెరియర్ గురించి ప్రస్తావించిన నిరోషా**
**స్టార్ హీరోల సరసన చేయడం అదృష్టమని వ్యాఖ్య**
**4 భాషల్లో 100కి పైగా సినిమాలు చేశానని వెల్లడి**
**ఈ రోజుల్లో 'ఘర్షణ' రిలీజ్ అయితే బాగుండేదన్న నిరోషా**

1990లలో వెండితెరపై సందడి చేసిన కథానాయికలలో నిరోషా ఒకరు. 'నారీనారీ నడుమ మురారి' .. 'కొబ్బరి బొండం' .. 'మధురానగరిలో' వంటి హిట్స్ ఇచ్చిన నిరోషాకి అప్పట్లో యూత్ ఫాలోయింగ్ విపరీతంగా ఉండేది. ఇక 'సిందూర పువ్వు' .. 'ఘర్షణ' వంటి సినిమాలు, అంతా ఆమెను గురించి మాట్లాడుకునేలా చేశాయి. అలాంటి నిరోషా ప్రస్తుతం సీరియల్స్ తో బిజీగా ఉన్నారు. రీసెంటుగా ఆమె 'తెలుగు వన్'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. "తెలుగులో నా ఫస్టు మూవీ బాలకృష్ణగారితో .. రెండవ సినిమా చిరంజీవిగారితో చేయడం నా అదృష్టంగా భావిస్తూ ఉంటాను. తెలుగు .. తమిళ భాషల్లో గొప్ప దర్శకులతో నా కెరియర్ మొదలుకావడం కూడా నా అదృష్టమే. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ భాషల్లో హీరోయిన్ గా 100కి పైగా సినిమాలు చేశాను. ఇన్ని సినిమాలు చేస్తానని నేనే అనుకోలేదు. ఒక రకంగా ఈ జనరేషన్ హీరోయిన్స్ కి ఇది పెద్ద టాస్క్ లాంటిదేనని చెప్పుకోవచ్చు" అని అన్నారు. 'ఘర్షణ' సినిమా అప్పట్లో విడుదలై పెద్ద హిట్ అయింది. అయితే ఆడియన్స్ రెస్పాన్స్ తెలుసుకునే ఛాన్స్ లేదు. డిజిటల్ ప్లాట్ ఫామ్స్ అందుబాటులో ఉన్న ఈ రోజులలో ఆ సినిమా రిలీజ్ అయితే ఎలా ఉండేదో అనిపిస్తుంది. 'ఘర్షణ' సినిమాలో నన్ను నేను చూసుకున్నప్పుడు, కాలం అక్కడ ఆగిపోతే ఎంతో బాగుండేది కదా అనిపిస్తూ ఉంటుంది. మంచి పాత్రలు వస్తే, తెలుగులో చేయడానికి సిద్ధంగానే ఉన్నాను" అని చెప్పారు.



# మాస్ జాతర నుంచి విడుదలైన 'ఓలే ఓలే' పాట



**మాస్ జాతర నుంచి విడుదలైన 'ఓలే ఓలే' పాట**

**మాస్ జాతర: ఆగస్టు 27న విడుదల**

రవితేజ, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం మాస్ జాతర. ఈ సినిమాకి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.

**ఓలే ఓలే పాట విడుదల**

సినిమా విడుదల దగ్గర పడుతుండటంతో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది చిత్ర యూనిట్. ఇందులో భాగంగానే తాజాగా ఈ సినిమా నుంచి రెండో పాటను (%ంవఎశీఅఎ ంశీఅస్త్ర%) విడుదల చేశారు. ఓలే ఓలే (%ఉశ్రీవ ఉశ్రీవ ాశీఅస్త్ర%) అంటూ సాగే ఈ పాట ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది. ఈ పాటకు భాస్కర్ యాదవ్ దాసరి సాహిత్యం అందించగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించడమే కాకుండా రోహిణి సోరట్‌తో కలిసి పాడారు.




## ఆడుజీవితం కి నేషనల్ అవార్డు రాకుండా
# బీజేపీ అడ్డుకుంది: దర్శకుడు బ్లెస్సీ

**71వ జాతీయ చలనచిత్ర అవార్డులపై వివాదం**

71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన తర్వాత, కేరళ ప్రభుత్వం కేంద్రంపై తీవ్ర విమర్శలు చేసింది. మలయాళ చిత్రాలను పక్కన పెట్టేసి అవార్డులను ప్రకటించారంటూ కేరళ ప్రభుత్వం ఆరోపించింది. ముఖ్యంగా, 'ఆడుజీవితం' చిత్రానికి అవార్డులు దక్కకపోవడంపై దర్శకుడు బ్లెస్సీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'ఆడుజీవితం' సినిమాపై జాతీయ అవార్డుల జ్యూరీ ఛైర్మన్ అశుతోష్ గోవారికర్ గతంలో ప్రశంసలు కురిపించినప్పటికీ, ఇప్పుడు ఆ చిత్రంలో సాంకేతిక లోపాలు ఉన్నాయని చెప్పడంపై బ్లెస్సీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. 'ఆడుజీవితం'లో ప్రధాన పాత్ర పోషించిన నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌పై ఉన్న కోపంతోనే ఈ చిత్రానికి అవార్డును నిరాకరించారని బ్లెస్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పృథ్వీరాజ్ సుకుమారన్‌తో రాజకీయ విభేదాలు**

పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించిన మరో చిత్రం 'ఎల్2: ఎంపురాన్' (%ూ2: జుఎజూబతీఖ్ఖుఅ%). ఈ సినిమాలో 2002 గుజరాత్ అల్లర్లకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. ఈ సన్నివేశాలను తొలగించాలని సినిమా విడుదలైన తర్వాత బీజేపీ డిమాండ్ చేసింది. ఈ వివాదం కారణంగానే పృథ్వీరాజ్ నటించిన 'ఆడుజీవితం'ను కూడా జ్యూరీ పక్కన పెట్టిందని, రాజకీయ కారణాలతోనే ఈ చిత్రానికి అవార్డులు దక్కలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339